తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం - 23 - మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 362 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# రేవంత్ రెడ్డి వ్యూహాత్మక సమీక్షలు

## జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో సమావేశాలు

- నాగర్‌కర్నూల్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మెదక్ ఎమ్మెల్యేలు ఇప్పటికే భేటీ
- ప్రతి ఎమ్మెల్యేతో వ్యక్తిగతంగా చర్చ .. పనితీరు, ప్రజాసంబంధ సమస్యలపై 10–15 నిమిషాల పరస్పర చర్చ
- అభివృద్ధి ప్రణాళికలకు సీఎం దిశానిర్దేశం
- పంచాయతీ ఎన్నికల దిశగా ప్రభుత్వ సిద్ధత
- రూ. 153 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల
- జూన్‌లో పంచాయతీ ఎన్నికల ఛాన్స్?
- పనితీరుపై కూడా సమీక్ష – ఫలితాలపై దృష్టి



(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల వారీగా రివ్యూలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలతో విడివిడిగా మాట్లాడుతున్నారు. ఇప్పటికే మూడు జిల్లాల రివ్యూలు పూర్తయ్యాయి. సమస్యలు ఏం ఉన్నాయ్..? ఏం చేద్దాం..? మీ పనితీరు ఎలా ఉంది.. ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది? అంటూ ఆరా తీస్తున్నారని సమాచారం. ఎమ్మెల్యేల ఆలోచనలేంటో చెప్పాలని కోరుతున్నారు. ఎమ్మెల్యేలకు ఉన్న ప్రజాసంబంధ అవసరాలు, బాధలు వినేందుకు తాను సిద్ధమంటున్నారు. ఇప్పటి వరకు నాగర్ కర్నూల్, మేడ్చల్ మల్కాజ్ గిరి, మెదక్ జిల్లాల ఎమ్మెల్యేలతో మాట్లాడారు. గతంలో మాదిరి కాకుండా ఈసారి ఒక్కో ఎమ్మెల్యేతో విడివిడిగా భేటీ అయినట్లు తెలిసింది. ప్రతి ఎమ్మెల్యేతో 10 నుంచి 15 నిమిషాలపాటు మాట్లాడిన సీఎం ఎమ్మెల్యేల అభిప్రాయాలను వినడంతోపాటు వారికి దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకురావాలని, కాంగ్రెస్ నుంచి గెలిచిన ప్రతి ఎమ్మెల్యే తనకు సమానమేనని, అందరికీ తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు.

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతన్నట్టుగా కనిపిస్తోంది. ఇందులో భాగంగానే సీఎం జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారని, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నారని సమాచారం. ఈ క్రమంలోనే సర్పంచులకు ప్రభుత్వం బకాయి పడి ఉన్న బిల్లులను రిలీజ్ చేసిందని సమాచారం. రూ. 10 లక్షల లోపు ఉన్న బిల్లులను ప్రభుత్వం రిలీజ్ చేసింది. నిన్న ఒక్క రోజే 153 కోట్ల రూపాయలు పెండింగ్ బిల్లులను ప్రభుత్వ విడుదల చేసింది. త్వరలోనే రైతు భరోసా వేసేందుకు కూడా సిద్ధమవుతోందని సమాచారం. జూన్ లో పంచాయతీ ఎన్నికల నిర్వహిస్తే ఎలా ఉంటుందనే ప్రస్తావన కూడా ఈ సందర్భంగా వచ్చినట్టు సమాచారం. మొదట పంచాయతీ ఎన్నికలు నిర్వహించి.. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనుందనే చర్చ ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో నియోజకవర్గాల వారీగా ఇంటెలిజెన్స్ రిపోర్టు ను తెప్పించుకున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే పలు హామీలను అమలు చేసిన దరిమిలా గ్రౌండ్ రిపోర్ట్ ఏమిటన్న అంశంపై క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరించారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేలతో విడివిడిగా భేటీ అవుతూ.. స్థానిక అంశాలపై చర్చిస్తూ వాటిని పరిష్కరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్న క్రమంలో వారి పనితీరుపైనా చర్చ జరుగుతోందని సమాచారం.



# "నా నరాల్లో రక్తం కాదు, సింధూరం మరుగుతోంది"

## ఉగ్రవాదంపై మోదీ గట్టి హెచ్చరిక

- 22 నిమిషాల్లో ప్రతీకారం.. 9 ఉగ్ర స్థావరాల ధ్వంసం
- "మన ఆడబిడ్డల సింధూరం తుడిచేవాళ్లకు తగిన గుణపాఠం"
- పాక్‌తో చర్చలు ఉండవు .. పీవోకే గురించి మాత్రమే మాట్లాడతాం
- త్రివిధ దళాలకు స్వేచ్ఛ ఇచ్చాం.. పాక్ మోకరిలింది
- భారతదేశం ప్రతీకారం తీర్చుకుంటుంది – మోదీ హెచ్చరిక

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాకిస్తాన్‌పై మరోసారి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ఏప్రిల్ 22న జరిగిన దాడికి జవాబు కేవలం 22 నిమిషాల్లోనే ఇచ్చామన్నారు. 9 పెద్ద ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశామని.. మన ఆడబిడ్డల సింధూరం తుడిచేస్తే ఏం జరుగుతుందో మన శత్రువులతో పాటు ప్రపంచానికి కూడా తెలిసొచ్చిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాకిస్తాన్‌పై మరోసారి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ఏప్రిల్ 22న జరిగిన దాడికి జవాబు కేవలం 22 నిమిషాల్లోనే ఇచ్చామన్నారు. 9 పెద్ద ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశామని.. మన ఆడబిడ్డల సింధూరం తుడిచేస్తే ఏం జరుగుతుందో మన శత్రువులతో పాటు ప్రపంచానికి కూడా తెలిసొచ్చిందన్నారు. మన మహిళల సింధూరం తుడిచేందుకు వచ్చిన వాళ్లను మట్టిలో కలిపేశామన్నారు మోదీ. భారత్ మౌనంగా ఉంటుందనుకున్న వాళ్లు ఇప్పుడు భయపడుతున్నారన్నారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా గర్విస్తున్నారని ప్రధాని మోదీ.. రాజస్థాన్‌లోని బికనేర్‌లో జరిగిన బహిరంగ సభలో పేర్కొన్నారు.

మిగతా 2లో..

## నాంపల్లి కోర్టుకు హాజరైన సీఎం



తెలంగాణలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని గతంలో రేవంత్ రెడ్డిపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి నాంపల్లి మనోరంజన్ కోర్టుకు హాజరయ్యారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి రెండోసారి కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో విచారణ నిమిత్తం సీఎం రేవంత్ రెడ్డి కోర్టుకు హాజరు కావడం గమనార్హం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బేగంబజార్, నల్గొండ, మెదక్ పోలీస్ స్టేషన్లలో కేసు నమోదైంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రిజర్వేషన్లపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణకు హాజరయ్యారు. నల్గొండ టూ టౌన్ పీఎస్, బేగంబజార్ పీఎస్, మెదక్ జిల్లా కౌడిపల్లి పీఎస్ పరిధిలో నమోదైన మూడు కేసుల్లో వ్యక్తిగతంగా జడ్జి ముందు హాజరయ్యారు. సీఎం కోర్టుకు హాజరు కావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోర్టు హాల్ దగ్గరకు ఇతరులను అనుమతించలేదు. రేవంత్ రెడ్డిపై ఈ కేసులు నమోదైన సమయంలో ఆయన పీసీసీ చీఫ్‌గా ఉన్నారు.
ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి.. తనపై తప్పుడు కేసులు నమోదు చేశారని కోర్టుకు తెలిపారు. పోలీసులు చెప్తున్నవి అన్నీ కూడా అవాస్తవాలు. తాను ఎక్కడ ఎలాంటి తప్పు చేయలేదన్నారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి స్టేట్మెంట్ కోర్టు నమోదు చేసుకుంది. ఈ మేరకు జూన్ 12వ తేదీన నాంపల్లి స్పెషల్ కోర్టు తీర్పు ప్రకటించనుంది. ఇక, విచారణ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి కోర్టు నుంచి తిరిగి వెళ్ళిపోయారు.

### కాళేశ్వరం-పాలమూరు దుష్ప్రచారంపై

# కేటీఆర్ ఘాటు విమర్శలు

- సుప్రీంకోర్టుతో పాలమూరు దుష్ప్రచారం తేలిపోయింది
- కాళేశ్వరం పై కాంగ్రెస్, బీజేపీ కలిసి నీచ రాజకీయాలు
- ప్రాజెక్టులపై కాదు – కమిషన్లపై ఆసక్తి: కేటీఆర్ విమర్శ
- సుప్రీంకోర్టు వ్యాఖ్యలు స్పష్టంగా ఉన్నాయి – ప్రభుత్వమే సమాధానం చెప్పాలి
- రైతుల ఆత్మహత్యలు–ధాన్యం నష్టం: సీఎంపై కేటీఆర్ ఆగ్రహం
- రైతుల ఆత్మహత్యలు–ధాన్యం నష్టం: సీఎంపై కేటీఆర్ ఆగ్రహం
- మిస్ వరల్డ్ పోటీలకు రూ.200 కోట్లు .. ప్రభుత్వ అప్రాధాన్యతపై ఆగ్రహం
- SLBC ప్రమాదంపై కాంగ్రెస్ మౌనం .. బాధితులను ఆదుకోవడంలో వైఫల్యం
- రేవంత్ రెడ్డి మాటలలో స్థిరత లేదు.. మల్టిపుల్ పర్సనాలిటీ డిసార్డర్‌తో ఉన్నట్టు స్పందన

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై చేసిన దుష్ప్రచారం తేలిపోయిందని, సుప్రీంకోర్టు సాక్షిగా నిజాలు బయటకు వచ్చాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (KTR) అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలసి కాళేశ్వరంపై చేస్తున్న దుష్ప్రచారం కూడా త్వరలో తేలిపోతుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నికృష్టమైన, నీఛమైన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణలో భవన్‌లో మీడియా ప్రతినిధులతో కేటీఆర్ చిట్ చాట్ చేశారు. 'ప్రజాపాలన పర్సంటేజీ పాలనగా మారిందని, దాన్నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఈ నోటీసులు. కాంగ్రెస్ పార్టీ కమిషన్లు బయటపడుతున్నాయని తెలిశాకే.. ఇప్పుడు నోటీసుల పేరిట తమాషాలు. సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై వ్యాఖ్యానించింది. జస్టిస్ గోష్



తన నివేదిక పూర్తయిందని, విచారణ పూర్తయిందన్నారు. అయితే కమిషన్ గడువు మళ్లీ ఎందుకు పొడిగించారో ప్రభుత్వం చెప్పాలి.

మిగతా 2లో..

### హైదరాబాదీలకు కేంద్రం గుడ్‌న్యూస్..

# నగరానికి కొత్తగా 2వేల ఎలక్ట్రిక్ బస్సులు..!

- హైదరాబాద్‌కి 2 వేల ఈ-బస్సులు కేటాయింపు
- బెంగళూరు, ఢిల్లీకి భారీ కేటాయింపులు
- పర్యావరణ స్పృహతో ప్రజారవాణా మార్పు లక్ష్యంగా
- రూ.10,900 కోట్ల వ్యయంతో రెండు సంవత్సరాల కార్యాచరణ
- ఈవీ కొనుగోలుదారులకు ఈ-వోచర్లు – ప్రోత్సాహక పథకం
- ఈ-అంబులెన్స్‌లు, ఈ-ట్రక్కులకు రూ.500 కోట్లు చొప్పన మంజూరు
- అనుబంధ ఈవీ వాహనాల ప్రోత్సాహానికి కేంద్ర చర్య

2 లో..



# రాగల రెండు రోజులు తెలంగాణలో భారీ వర్షాలు

## వాతావరణ కేంద్రం ప్రకటన

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

తూర్పు మధ్య అరేబియా సముద్రం, దక్షిణ కోంకణ్ గోవా తీర ప్రాంత సమీపంలో అల్పపీడనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ అల్పపీడనం ఉత్తర దిశగా కదులుతూ, రాగల 36 గంటల్లో మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వివరించింది. ఈ నెల 27న పశ్చిమ మధ్య సమీప ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో మరో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఇది తదుపరి రెండు రోజుల్లో మరింత బలపడే సూచనలు ఉన్నాయని వాతావరణ కేంద్రం ఓ ప్రకటనలో వివరాలు వెలువరించింది.
దీని ప్రభావంతో రాష్ట్రంలో ఇవాళ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇదే సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని



తెలిపింది. శుక్రవారం, శనివారాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సంచాలకులు వివరించారు. దీంతో రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# బ్యాంకర్లతో కలసి యువత అభివృద్ధి దిశగా రాజీవ్ యువ వికాసం: డిప్యూటీ సీఎం భట్టి

- రాజీవ్ యువ వికాసం పథకం లక్ష్యం.. ఐదు లక్షల యువతకు రుణాలు
- జూన్ 2న రుణాల మంజూరు లేఖలు పంపిణీ
- బ్యాంకర్ల సహకారం అవసరం.. భట్టి విక్రమార్క
- వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత
- మహిళల అభివృద్ధికి వడ్డీ రహిత రుణాలు
- విద్య, శిక్షణ, పరిశ్రమల దిశగా ముందడుగు
- మూసీ నది పునరుద్ధరణ, పారిశ్రామిక అభివృద్ధి దిశగా ప్రణాళికలు




(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

రాజీవ్ యువ వికాసం పథకానికి బ్యాంకర్లు సహకరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో పాల్గొన్న భట్టి.. జూన్ 2వ తేదీన ఐదు లక్షల మంది యువతకు రాజీవ్ యువ వికాసం పథకం మంజూరు పత్రాలు పంపిణీ చేయాలనే లక్ష్యాన్ని చేరుకోవడంలో బ్యాంకర్ల తోడ్పాటు అవసరమన్నారు. ఐదు లక్షల యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూ.6,250 కోట్లు సబ్సిడీతో ఈ పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఐదు లక్షల మంది నిరుద్యోగ యువతకు రుణాలు అందించే లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. జూన్ 2న రాజీవ్ యువ వికాసం రుణాల మంజూరు లేఖలు పంపిణీ చేయనున్నామని.. పథకం అమలును సమన్వయం చేయడానికి రాష్ట్ర స్థాయి నోడల్ అధికారిని నియమించాలని ఆయన బ్యాంకులను కోరారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఇందులో ఉద్యానవన పంటలకు పెద్దపీట వేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రైతుల రుణ భారాన్ని తగ్గించేందుకు రూ.21 వేల కోట్ల రూపాయల రైతు రుణమాఫీకి సంబంధించిన నిధులను ఇప్పటికే బ్యాంకుల్లో జమ చేశామని.. రైతు భరోసా ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నామని తెలిపారు. లాగే రైతు బీమా ప్రీమియం డబ్బులు ప్రభుత్వం కడుతుందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాబోయే ఐదేళ్లలో మహిళా సంఘాలకు లక్షల కోట్లు వడ్డీ రహిత రుణాలుగా ఇస్తూ మానవ వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు చేస్తున్నామని, పరిశ్రమల కోసం ట్రైనింగ్ అందిస్తున్నామని తెలిపారు. మూసీ నదిని పునర్జీవం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు, ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య పారిశ్రామిక అభివృద్ధి కోసం వివిధ క్లస్టర్ల ఏర్పాట్లపై ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు భట్టి విక్రమార్క తెలిపారు.

# భయపెడుతున్న కరోనా కొత్త వేరియంట్.. ఆరోగ్య శాఖ కీలక ప్రకటన..

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)



దేశంలో మళ్లీ కొవిడ్ భయాలు నెలకొన్న వేళ.. కేరళ అలర్ట్ అయింది. కేరళలో ఇటీవల కరోనా కేసులు పెరుగుతుండటంతో ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఆగ్నేయాసియా దేశాల్లో కొవిడ్ కేసులు పెరుగుతున్నందున.. కేరళ ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ సూచించారు. ఇక ఈ ఒక్క నెలలోనే కేరళలో 182 కరోనా కేసులు నమోదు కావడం ఇప్పుడు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్ర భయాందోళనలకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే లక్షణాలు ఉన్నవారు మాస్క్ పెట్టుకోవాల్సిందేనని పేర్కొన్నారు.

చైనాలో 2019లో వెలుగు చూసిన కరోనా మహమ్మారి.. ప్రపంచ దేశాలకు విస్తరించిన సంగతి తెలిసిందే. ఈ కొవిడ్ వైరస్ బారిన పడి.. లక్షలాది మంది మృతి చెందడమే కాకుండా కోట్లాదిమంది ఆస్పత్రుల పాలయ్యారు. ఇక చాలా మంది కొవిడ్ అనంతర సమస్యలతో బాధపడుతున్నారు. అయితే భారత్‌లోకి కరోనా వైరస్ వేరియంట్లు వెలుగు చూసిన ప్రతీసారి.. దాని మూలాలు కేరళలోనే ఉంటున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవలి కాలంలో హాంకాంగ్, సింగపూర్ దేశాల్లో కరోనా కేసులు భారీగా పెరిగిన వేళ కేరళ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే పరిస్థితిని ఎప్పటికప్పుడు కేరళ ఆరోగ్య శాఖ పర్యవేక్షిస్తోంది.

ఈ ఒక్క మే నెలలోనే కేరళ వ్యాప్తంగా 182 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో కేరళ ఆరోగ్య శాఖ అలర్ట్ అయింది. ఆగ్నేయాసియా దేశాల్లో పెరుగుతున్న కేసుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ పేర్కొన్నారు. ముఖ్యంగా కొట్టాయం, ఎర్నాకులం, తిరువనంతపురం జిల్లాల్లోని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కరోనా లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు పెంచాలని.. ఆస్పత్రుల్లో మాస్క్‌లు తప్పనిసరి చేయాలని ఆదేశించారు. నిఫా వైరస్ వ్యాప్తి లేదని నిర్ధారించినప్పటికీ.. వర్షాకాలంలో డెంగ్యూ వంటి వ్యాధుల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

హాంకాంగ్, సింగపూర్ వంటి దేశాల్లో ఒమిక్రాన్ జేఎన్1 సబ్‌వేరియంట్‌లు ఎల్ఎఫ్ 7, ఎన్‌బీ 1.8 వేరియంట్లు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని మంత్రి వీణా జార్జ్ తెలిపారు. అయితే ఈ వేరియంట్లకు వైరస్ వ్యాప్తి చెందే సామర్థ్యం ఎక్కువగా ఉందని వెల్లడించారు. ఆగ్నేయాసియా దేశాల్లో కొవిడ్ కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నాయని.. కేరళలో కూడా కొవిడ్ పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత వేరియంట్ల తీవ్రత అధికంగా లేనప్పటికీ.. ఎవరికి వారు రక్షణ చర్యలు పాటించాలని.. వీణా జార్జ్ సూచించారు.

ఈ ఒక్క నెలలోనే కేరళలో 182 కొత్త కొవిడ్ కేసుల్లో కొట్టాయం జిల్లాలో అత్యధికంగా 57 కేసులు.. ఎర్నాకులం 34 కేసులు.. తిరువనంతపురం 30 కేసులు నమోదయ్యాయని.. మిగిలిన కేసులు ఇతర జిల్లాల్లో వెలుగుచూసినట్లు తెలిపారు. కేరళలో కొవిడ్ పరిస్థితిని సమీక్షించడానికి.. తన నాయకత్వంలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించినట్లు వీణా జార్జ్ వెల్లడించారు. లక్షణాలు ఉన్నవారికి కొవిడ్ నిర్ధారణ టెస్ట్‌లు పెంచనున్నట్లు తెలిపారు. ఆస్పత్రులలో ఆర్టీపీసీఆర్ కిట్లు, భద్రతా పరికరాల లభ్యతను నిర్ధారించుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రులలో మాస్క్‌లు తప్పనిసరి అని.. ఆరోగ్య కార్యకర్తలు అన్ని వేళలా ధరించాలని పేర్కొన్నారు.

జలుబు, గొంతు నొప్పి, దగ్గు, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా మాస్క్‌లు ధరించాలని మంత్రి వీణా జార్జ్ సూచించారు. వృద్ధులు, గర్భిణీలు, తీవ్రమైన అనారోగ్యాలతో బాధపడుతున్నవారు బహిరంగ ప్రదేశాల్లో, ప్రయాణాల్లో మాస్క్‌లు ధరించడం మంచిదని హితవు పలికారు. అనవసరంగా ఆస్పత్రికి వెళ్లడం నివారించాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు సబ్బుతో చేతులు కడుక్కోవడం మంచిదని.. చికిత్స పొందేటప్పుడు ప్రోటోకాల్‌ను పాటించాలని.. ఆస్పత్రిలోనే చికిత్స తీసుకోవాలని సూచించారు. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు కొవిడ్ కేసులు ఉన్నప్పుడు ఇతర ఆస్పత్రులకు సిఫార్సు చేయడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం కొవిడ్ వేరియంట్లు వేగంగా వ్యాపిస్తున్నప్పటికీ.. తీవ్రత అధికంగా లేదని మంత్రి వీణా జార్జ్ ప్రజలకు భరోసా ఇచ్చారు. అయినప్పటికీ భారీగా వైరస్ వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి జాగ్రత్తలు తీసుకోవడం.. ముందస్తు పరీక్షలు చేసుకోవడం, మాస్క్ ధరించడం కీలకమైన చర్యలని ఆమె నొక్కి చెప్పారు. మరోవైపు.. వర్షాకాలం సమీపిస్తున్నందున.. డెంగ్యూ, లెప్టోస్పైరోసిస్, ఇతర నీటి ద్వారా వచ్చే వ్యాధులు పెరిగే అవకాశం ఉందని ఆరోగ్య శాఖ హెచ్చరించింది.

# న్యూ లుక్‌తో టాటా ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్..

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)




ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌లో ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్‌ను లాంచ్ చేసింది. అత్యాధునిక ఫీచర్లు, సరికొత్త డిజైన్‌తో 2025 టాటా ఆల్ట్రోజ్‌ను భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. దీని ధర రూ.6.89 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. మారుతీ సుజుకీ బాలెనో, హ్యుందాయ్ ఐ20, టయోటా గ్లాంజా వంటి కార్లకు ఇది గట్టి పోటీ ఇవ్వనుంది. స్మార్ట్, ప్యూర్, క్రియేటివ్, అకాంప్లిష్డ్ ఎస్, అకాంప్లిష్డ్ +ఎస్ వేరియంట్లలో కొత్త ఆల్ట్రోజ్‌ను తీసుకొచ్చారు. ప్రిస్టైన్ వైట్, ప్యూర్ గ్రే, రాయల్ బ్లూ, ఎంబర్ గ్లో, డ్యూన్ గ్లో రంగుల్లో లభిస్తుంది. జూన్ 2 నుంచి బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి. డిజైన్‌పరంగా 2025 టాటా ఆల్ట్రోజ్‌లో కొన్ని మార్పులు చేశారు. ఎల్‌ఈడీ హెడ్‌లైట్లు, ఐ బ్రో స్టైల్ ఎల్ఈడీ డీఆర్ఎల్స్ ఇచ్చారు. సరికొత్త లుక్‌తో ఆకర్షించేందుకు బంపర్‌ను నూతనంగా తీర్చిదిద్దారు. అల్లాయ్ వీల్స్‌కు కొత్త డిజైన్ అందించారు. యాంబియంట్ లైటింగ్, వాయిస్ ఎనేబల్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఛార్జర్, ఎయిర్ ప్యూరిఫైయర్ వంటి ఫీచర్లు ఉన్నాయి. 5 స్టార్ GNCAP సేఫ్టీ రేటింగ్‌తో వస్తోంది. సిక్స్ ఎయిర్‌బ్యాగులు, ఈఎస్‌పీ, హిల్ హోల్డ్ అసిస్టెంట్, ఫాగ్ ల్యాంప్స్, 360 డిగ్రీల కెమెరా, ఎస్ఓఎస్ కాల్ ఫంక్షన్ వంటి సేఫ్టీ ఫీచర్లతో తీసుకొచ్చింది. 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్, 1.5 లీటర్ల డీజిల్ ఇంజిన్, 1.2 లీటర్ల సీఎన్‌జీ ట్విన్ సిలిండర్ ఆప్షన్లు ఉన్నాయి. 5 స్పీడ్ ఎంటీ, 6 స్పీడ్ డీసీఏ, న్యూ 5 స్పీడ్ ఏఎంటీ వంటి ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లతో వస్తోంది.

# "నా నరాల్లో రక్తం కాదు, సింధూరం మరుగుతోంది"

(మొదటి పేజీ తరువాయి)



భారత్‌ది కేవలం ఆక్రోశం మాత్రమే కాదన్నారు ప్రధాని మోదీ. ఇది సమర్థ భారత్ రౌద్ర రూపమని.. ఇదే నవ భారతమని తెలిపారు. పాకిస్తాన్‌తో ఎలాంటి చర్చలు ఉండవన్నారు మోదీ. ఒకవేళ చర్చలు జరిగితే కేవలం పీవోకే (పాక్ ఆక్రమిత కాశ్మీర్) మీదే జరుగుతాయని స్పష్టం చేశారు. పాక్‌కు చుక్క నీటిని కూడా వదిలేదిలేదన్నారు. ప్రపంచంలోని ఏ శక్తి ఈ విషయంలో మనల్ని ఆపలేదని స్పష్టం చేశారు.

''నా నరాల్లో రక్తం కాదు, సిందూరం మరుగుతోంది'' అని మోదీ ఉద్ఘాటించారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్ ఐక్యంగా ఉంది. పహల్గామ్ దాడి తూటాలు 140 కోట్ల మంది భారతీయుల గుండెల్లో గుచ్చుకున్నాయని.. ఈ ఘటనతో దేశ ప్రజల రక్తం మరిగిపోయిందని మోదీ పేర్కొన్నారు. త్రివిధదళాలకు తమ ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందన్నారు. సమర్థవంతంగా త్రివిధదళాలు పాక్‌ను చావుదెబ్బ కొట్టాయని మోదీ పేర్కొన్నారు. సాయుధ దళాలకు ఇచ్చిన స్వేచ్ఛా హస్తం ఫలితంగా పాకిస్తాన్ మోకరిల్లిందని మోదీ పేర్కొన్నారు. తన మైండ్ కూల్ గా ఉన్నా.. రక్తం మరుగుతూ ఉంటుందని.. ఈ విషయాన్ని పాక్ మరిచిపోవద్దని హెచ్చరించారు. భారతదేశం ఉగ్రవాద దాడి జరిగితే.. ప్రతీకారం బలంగా తీర్చుకుంటామని.. వదిలిపెట్టమని పేర్కొన్నారు

# కాళేశ్వరం-పాలమూరు దుష్ప్రచారంపై కేటీఆర్ ఘాటు విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)



కాళేశ్వరం నోటీసులు ఇప్పటిదాకా నేరుగా అందినట్టు సమాచారం లేదు. అందిన తర్వాత ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటాం.

కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్ని బ్యారేజీలను కూలగొట్టి మళ్లీ టెండర్ల పిలిచి, 20 నుంచి 30 శాతం కమిషన్లు తీసుకోవాలన్నదే అసలు ఏజెండా. సుప్రీంకోర్టుకు కాళేశ్వరం ప్రాధాన్యత, గొప్పతనం అర్థమైంది.

సెంట్రల్ వాటర్ కమిషన్‌కు అర్థమైంది, అందుకే 'ఇరిగేషన్ మార్వెల్' అన్నారు. న్యాయమూర్తులకు అర్థమవుతుంది, కానీ ఇక్కడ అధికారంలో ఉన్న అజ్ఞాని ముఖ్యమంత్రికి అర్థమవడం లేదు. పాలమూరురంగారెడ్డిపై ముఖ్యమంత్రి చేసిన కుట్రలు విఫలమయ్యాయి. పాలమూరురంగారెడ్డిని వెంటనే పూర్తిచేసి మహబూబ్‌నగర్ ప్రజలకు సాగునీరు ఇవ్వాలని ప్రజల తరపున డిమాండ్ చేస్తున్నాం. పాలమూరు బిడ్డను అని చెప్పుకున్న రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టును ఎందుకు పక్కన పెట్టారు?. పాలమూరులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పినట్టే, కాళేశ్వరంపైన కూడా స్పష్టమైన తీర్పులు వస్తాయి. కాళేశ్వరం ప్రాధాన్యతను ప్రజలకు, ఈ మూర్ఖ కాంగ్రెస్ నాయకులకు అర్థమయ్యేలా చెబుతాయి.

580 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే, ముఖ్యమంత్రి అందాల పోటీలో ఉండడం కరెక్టా?. అన్నదాతల ధాన్యం వర్షంలో కొట్టుకుపోతుంటే, అందాల పోటీలకు రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో అతిపెద్ద ప్రమాదం జరిగితే ఒక్కసారి పోనీ రేవంత్ రెడ్డి అందాల పోటీలకు నాలుగు సార్లు పోయాడు. రాష్ట్ర ప్రభుత్వ దగ్గర ఒక రూపాయి కూడా లేదు అని చెప్పి, అందరూ దొంగల్లా చూస్తున్నారంటూ.. రూ.200 కోట్లు అందాల పోటీలకు ఖర్చు పెట్టడం కరెక్టా?. మిస్ వరల్డ్ కాంటెస్టులకు మంత్రులంతా టూర్ గైడ్లుగా మారిపోయారు. మంత్రులు సొంగ కార్చుకుంటూ అందాల పోటీలో పాల్గొంటున్నారని సీపీఐ నారాయణ అన్నారు. మిస్ వరల్డ్ బ్యూటీస్.. కాళేశ్వరం మీద నోటీసులు.. ఇదే రేవంత్ రాజకీయం. మిస్ వరల్డ్ బ్యూటీస్‌కి కూడా రేవంత్ రెడ్డి చూపిస్తున్నది అంతా తమ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టులు మాత్రమే. నిజాం కట్టిన చార్మినార్ లేదా కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులు తప్ప, కాంగ్రెస్ పార్టీ కట్టిన ఒక్కదానినైనా రేవంత్ రెడ్డి చూపించగలడా?. కాళేశ్వరంలోని రెండు పిల్లర్లకు ఇంత రాద్ధాంతం చేస్తున్న కాంగ్రెస్, ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై ఏం చేసింది?. మూడు నెలల తర్వాత కూడా అందులో చిక్కుకున్న వారిని బయటకు తీయలేకపోయారు. కమీషన్ల కోసం ఎస్ఎల్బీసీని హడావిడిగా మొదలుపెట్టారు. రేవంత్ రెడ్డి భాషలో చెప్పాలంటే, మగోడు అయితే ఈ ప్రమాదంలో చిక్కుకున్న వారిని బయటకు తీసేవాడు. ఇదే విధంగా కాళేశ్వరం విషయంలో కూడా దాని ప్రాధాన్యత బయటకు వస్తుంది. రేవంత్ రెడ్డిలో అపరిచితుడు ఉన్నాడు.. ఒకరోజు కాళేశ్వరాన్ని 'కూలేశ్వరం' అంటాడు. రేవంత్ రెడ్డికి భయంకరమైన మానసిక వ్యాధి ఉంది. 'మల్టిపుల్ పర్సనాలిటీ డిసార్డర్' అనే మానసిక రుగ్మతతో ఉన్నాడు. అందుకే ఒకే అంశంపై ఆయన రోజుకోలా మాట్లాడతారు. మరో రోజు కాళేశ్వరంలోని మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు తెస్తామంటారు. వాళ్ల ప్రభుత్వంలోని మంత్రులు రంగనాయక సాగర్ నుంచి నీళ్లకు జెండాలు ఊపుతారు. ఒక రోజు అప్పు లేదు అంటారు.. మరొక రోజు అసెంబ్లీలో రూ.1,70,000 కోట్ల అప్పు చేశామని అంటారు. ఒక రోజు కాకతీయ కళాతోరణం అధికార చిహ్నంగా వద్దంటారు. మరొక రోజు అందాల పోటీదారులకు దాన్ని చూపిస్తారు. ఒక రోజు కేసీఆర్ ఆనవాళ్లు తొలగిస్తామని అంటారు. మరొక రోజు కేసీఆర్ కట్టిన ప్రతిదీ తిరిగి చూపిస్తారు.' అని కేటీఆర్ అన్నారు.

# హైదరాబాదీలకు కేంద్రం గుడ్‌న్యూస్.. నగరానికి కొత్తగా 2వేల ఎలక్ట్రిక్ బస్సులు..!

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)




హైదరాబాద్ నగర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. పర్యావరణ హితమైన ప్రజారవాణాను ప్రోత్సహించే దిశగా చేపట్టిన పీఎం ఈడ్రైవ్ పథకం కింద నగరానికి 2,000 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించినట్లు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. ఈ నిర్ణయంతో హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు, కాలుష్య నియంత్రణకు కూడా దోహదపడనుంది.

కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపుపై ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో తెలంగాణ, కర్ణాటక, ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాలపై ప్రధానంగా దృష్టి సారించారు. పథకం ప్రస్తుత దశలో బెంగళూరుకు సుమారు 4,500, ఢిల్లీకి 2,800, అహ్మదాబాద్‌కు 1,000, సూరత్‌కు 600 బస్సులతో పాటు హైదరాబాద్‌కు 2,000 ఎలక్ట్రిక్ బస్సులను అందజేయనున్నట్లు మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ సందర్భంగా మంత్రి కుమారస్వామి మాట్లాడుతూ, "ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ఇప్పుడు సుస్థిర పట్టణ రవాణా దిశగా దృఢమైన అడుగులు వేస్తోంది. బెంగళూరు నుంచి ఢిల్లీ వరకు, నగరాలు ప్రజారవాణాను మరింత పరిశుభ్రంగా, సమర్థవంతంగా మార్చేందుకు



ఎలక్ట్రిక్ బస్సులను చురుకుగా స్వీకరిస్తున్నాయి," అని తెలిపారు. "మేము కేవలం ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించడమే కాకుండా, నూతన ఆవిష్కరణలు మరియు పర్యావరణ స్పృహతో భారతదేశ రవాణా వ్యవస్థ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాం" అని ఆయన వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పీఎం ఈడ్రైవ్ హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని కుమారస్వామి పేర్కొన్నారు.

పీఎం ఈడ్రైవ్ కార్యక్రమం ద్వారా ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2026 వరకు రెండేళ్ల కాలంలో రూ.10,900 కోట్ల మొత్తం ఆర్థిక వ్యయంతో 14,028 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ ప్రయత్నాలలో ఒకటిగా నిలుస్తుందని, సకాలంలో బస్సుల పంపిణీ, కార్యాచరణ సంసిద్ధత, మరియు భాగస్వామ్య రాష్ట్రాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

ఈ పథకం కింద డిమాండ్ ఇన్సెంటివ్‌ను పొందేందుకు ఈవీ కొనుగోలుదారులకు ఈవోచర్లను కూడా భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టింది. అంతేకాకుండా, పీఎం ఈడ్రైవ్ పథకంలో భాగంగా ఈఅంబులెన్స్‌లు, ఈట్రక్కుల కోసం కూడా చెరో రూ.500 కోట్లు కేటాయించారు. రోగుల సౌకర్యవంతమైన రవాణా కోసం ఈఅంబులెన్స్‌ల వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ పథకం యొక్క ఉద్దేశ్యం. అదేవిధంగా, వాయు కాలుష్యానికి ప్రధాన కారణమవుతున్న ట్రక్కుల స్థానంలో ఈట్రక్కులను కూడా పథకంలో చేర్చారు.

## సంఘ సంస్కర్తకు ఘననివాళి అర్పించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో తెలంగాణ ముచ్చట్లు,**

దళిత వైతాళికులు, సంఘ సంస్కర్త ఎం.వి.భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆదర్శమైన జీవితాన్ని. స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సంఘసంస్కర్త ఎం.వి.భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్
ఎం.వి. భాగ్యరెడ్డి వర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఎం.వి.భాగ్యరెడ్డి వర్మ సేవలను కొనియాడారు. హైదరాబాద్ ఉన్న సంస్థానంలో 26దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి పునాదులు వేశారని గుర్తు చేశారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న దేవదాసి వ్యవస్థ, జోగిని వ్యవస్థలపై అవిశ్రాంత పోరాటం చేసి వాటి రద్దుకు నిజాం నవాబులను ఒప్పించిన ఘనత భాగ్యరెడ్డివర్మదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారి శశికళ కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేసిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

మహిళ పోలీస్ స్టేషన్ లో భాధ్యతలు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన హెడ్ కానిస్టేబుల్ కె.తిరుమలరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జె.క్రిష్ణ కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 7,99,000/ రూపాయల భద్రత ఎక్స్‌గ్రేసియా చెక్కును గురువారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ...శాఖపరంగా ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకైన పోలీస్ అధికారులు అందుబాటులో వుంటారని అన్నారు. పోలీసు కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామన్నారు.







# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి...

- **తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, ఏదులాపురం మునిసిపాలిటీ అభివృద్ధి పై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను అధికారులు చిత్తశుద్ధితో పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల క్రింద మొదటి విడతగా ప్రతి మండలంలోని ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి జిల్లా వ్యాప్తంగా 875 ఇండ్లు మంజూరు చేయగా 475 ఇండ్లు గ్రౌండింగ్ అయినట్లు తెలిపారు. 420 కి పైగా ఇండ్లు బేస్మెంట్ లెవల్ పూర్తి చేయగా మొదటి విడత లక్ష రూపాయలు మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం ఇండ్లు కట్టుకొవడానికి సిద్ధంగా లేని వారి నుండి అంగీకారం తీసుకొని అర్హులైన మరొకరికి మంజూరుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్వాక్రా ద్వారా రుణాలు అవసరమయ్యే వారికి అందించాలని, డ్రాప్ అయ్యే వారిని రెండో విడతలో కేటాయించాలని అన్నారు. ప్రతి సోమవారం విడతల వారి డబ్బును మంజూరు చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు.
రెండో విడత క్రింద నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయించగా, జిల్లాకు 17983 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు లక్ష్యం కేటాయించామన్నారు. 12276 ఇండ్లకు సంబంధిత నియోజకవర్గాల నుండి మంజూరు కు ప్రతిపాదనలు రాగా ఇప్పటివరకు 7212 ఇండ్లు ఇంచార్జ్ మంత్రివర్యుల ఆమోదం పొంది, జాబితా అందిందన్నారు.
డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి, లబ్ధిదారుల జాబితా వచ్చే నెల మొదటి వారంలో పూర్తి చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు విధి విధానాలు ఖచ్చితంగా అమలు పర్చాలన్నారు. కడు పేదవారు, ఇండ్ల స్థలం లేనివారిని ఎంపిక చేయాలన్నారు.
భూ భారతి 2025 క్రింద ప్రతి మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. పైలట్ ప్రాజెక్ట్ క్రింద జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని ఎంపిక చేసి, మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యల దరఖాస్తులు స్వీకరించామన్నారు. రెండో విడతగా జిల్లాలోని బోనకల్ మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు.
నేలకొండపల్లి మండలంలో రెవెన్యూ సదస్సుల ద్వారా 3264 దరఖాస్తులు స్వీకరించగా, అందులో 1786 సాదా బైనామ దరఖాస్తులు ఉన్నట్లు తెలిపారు. కోర్ట్ నుండి సాదా బైనామా విషయమై కేస్ వెకేట్ కాగానే, దరఖాస్తులు పరిష్కారం చేసేలా విచారణలు, సర్వేలు పూర్తిచేసి, సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ భూమి, భూసేకర చేసిన భూమి విషయంలో జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అసైన్డ్ భూముల్లో ఉన్న పేదవారికి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సిసిఎల్ఏ నుండి ఏలాంటి ఉత్తర్వులు కావాలన్న సమాచారం ఇవ్వాలన్నారు.
జిల్లాలోని ఎర్రుపాలెం మండలం మూలుగుమాడును రీ సర్వే కి పైలట్ గ్రామంగా ఎంపిక చేశామన్నారు. పైలట్ గ్రామంలో రీ సర్వే పూర్తిచేస్తే, భవిష్యత్తులో రాష్ట్ర మంతటికి రీ సర్వే కి సమస్యలు విషయమై క్లారిటీ వస్తుందన్నారు. రీ సర్వే లో ప్రజల ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని, రీ సర్వే తో నక్ష తయారుతో మంచి జరుగుతుందా, సమస్యలు పరిష్కారం అవుతున్నాయా, ఎందరికి మంచి జరుగుతుంది వాస్తవ నివేదిక సమర్పించాలన్నారు.
జూన్ 2 నుండి అన్ని మండలాల్లో సర్వేకి, మండలానికి 2 టీములు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో 465 మంది లైసెన్స్ సర్వేయర్లకు దరఖాస్తు చేశారని, రిటైర్, ప్రస్తుత సర్వేయర్లతో వీరందరికి శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణ సోమవారం నుండి ప్రారంభించాలని, శిక్షణకు జిల్లాలో పక్కా ప్రణాళిక చేయాలన్నారు.
ఏదులాపురం మునిసిపాలిటీ ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన పనుల విషయమై ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మునిసిపాలిటీలో 32 వార్డులు 60 వేల జనాభా ఉందన్నారు. పారిశుద్ధ్యం, పెండింగ్ బిల్లులు, అనుమతులపై దృష్టి పెట్టాలన్నారు. వ్యర్థాల నుండి ఆదాయం సమకూరే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కావాల్సిన సిబ్బంది ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ భూమిని గుర్తించి, రక్షణ చేయాలన్నారు. త్రాగునీటి, రోడ్లు, సదుపాయాల, హై టెన్షన్ వైర్ల తరలింపునకు చర్యలు తీసుకోవాలని అన్నారు. తీగల వంతెన నిర్మాణంలో ఇండ్లు కోల్పోయిన 28 మంది పేదవారికి ప్రత్యామ్నాయ స్థలం చూపాలన్నారు. తక్కువ మొత్తంలో అందంగా మునిసిపాలిటీ ని తీర్చిదిద్దేందుకు ప్రణాళిక చేయాలన్నారు.
సమీక్షలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల వేగవంతానికి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. భూ భారతి క్రింద పైలట్ మండలాల భూ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చేశామన్నారు. ఎదులాపురం మునిసిపాలిటీ లో పారిశుద్ధ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ప్రకారం పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ అన్నారు.
ఈ సమీక్ష లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి, తహాశీల్దార్లు వెంకటేశ్వర్లు, రమాదేవి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## టిజెఎఫ్ రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయండి

- **జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి**
- **టిజెఎఫ్ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే విధానంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఏర్పడిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టిజెఎఫ్) యూనియన్ పురుడుపోసుకొని 25 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఈ నెల 31న హైదరాబాద్ లో అట్టహాసంగా జరగనున్న రజతోత్సవ ప్రారంభ వేడుకలను జయప్రదం చేయాలని టిజెఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిలు పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం టియు డబ్ల్యూజే (టిజెఎఫ్) వాల్ పోస్టర్ ను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ.. చిర్రా రవి లు మాట్లాడుతూ.. తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవ సంబరాలను నిర్వహించబోతున్నామని, ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.
24న ఆర్టిఐ కమిషనర్ సీనియర్ జర్నలిస్ట్ పివి శ్రీనివాసరావు కు అభినందన సభ ఆర్టిఐ కమిషనర్ గా బాధ్యతులు చేపట్టిన ఖమ్మంకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ పివి శ్రీనివాసరావుకు ఈ నెల 24న ఖమ్మంలో ఆత్మీయ అభినందన సభను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి శెట్టి రజనీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, వనం నాగయ్య, మందుల ఉపేందర్, దుంపల భాస్కర్, శ్రీధర్ శర్మ, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి, సహాయ కార్యదర్శి మూల జీవన్ రెడ్డి, నరాని సాయి, కెమెరా మెన్ల సంఘం పృధ్వి, గడ్డం సతీష్, శంకర్, నాయకులు వెంకటకృష్ణ, పిసిడబ్ల్యూ నరేష్, పొన్నెబోయిన పానకాలరావు, ఉల్లోజు రమేష్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, నల్లమోతు శ్రీనివాస్, వెంపటి నాయుడు, రాజేందర్ రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగం సాధించిన అలేఖ్య యాదవ్‌ను సన్మానించిన అఖిలపక్ష ఐక్యవేదిక

**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

నిజాయితీగా కష్టపడితే లక్ష్యాలు తప్పక సాధ్యమవుతాయన్న విషయాన్ని మిత్రుడు నాగరాజు కూతురు అలేఖ్య యాదవ్ మరోసారి రుజువు చేసింది. ఇటీవల ఇరిగేషన్ శాఖలో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ జే టి ఓ గా ఎంపికైన అలేఖ్య యాదవ్‌ను అఖిలపక్ష ఐక్యవేదిక ఘనంగా సన్మానించింది.ఈ సందర్భంగా ఐక్యవేదిక సభ్యులు గురువారం ఆమె నివాసానికి వెళ్లి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ..వనపర్తి జిల్లాలో విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి, ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలు పొందడాన్ని ప్రోత్సహించడమే మా ప్రధాన లక్ష్యం. అలేఖ్య యాదవ్ వంటి యువతీ యువకులు మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు,అని తెలిపారు. అలాగే, యువత చెడు అలవాట్లకు దూరంగా



ఉండి కృషి చేసి ప్రభుత్వ,ప్రైవేటు రంగాలలో స్థిరపడాలని ఆకాంక్షించారు.వనపర్తి జిల్లా పేరు గర్వంగా నిలిపే విధంగా యువత నడుచుకోవాలని వేదిక తరఫున సూచించారు.ఈ సన్మాన కార్యక్రమంలో అలేఖ్య యాదవ్ తండ్రి నాగరాజు సహా కుటుంబ సభ్యులు, విజేత రాములు, వెంకటేశ్వర్లు,గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్,కురుమూర్తి, యమదుగ్గిశివకుమార్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంతో ప్రజల భూ సమస్యలు పరిష్కారం..

- **రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి.**
- **కలెక్టరేట్ లో మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి పొంగులేటి.**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రభుత్వం భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లు అంశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, ప్రజల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ధరణి చట్టాన్ని ప్రక్షాళన చేసి, ప్రజలు మెచ్చే విధంగా భూ భారతి చట్టాన్ని తెచ్చామన్నారు. చట్టం విధి విధానాలపై ప్రజల్లో అవగాహన కు మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు చేపట్టినట్లు, రాష్ట్రంలోని 33 జిల్లాలకు గాను 29 జిల్లాల్లో ప్రత్యక్షంగా తాను పర్యటించినట్లు తెలిపారు. ఏ గ్రామం, ఏ ప్రాంతానికి వెళ్లిన ప్రజలు ధరనితో ఎన్ని ఇబ్బందులు పడ్డారో చూశానని అన్నారు. అన్ని ప్రాంతాల ప్రజలు, ఆసాములు భూ భారతి చట్టంపై సంతోషం వెలిబుచ్చారన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్ల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకున్నామన్నారు.
జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని పైలట్ మండలంగా ఎంపిక చేసి, అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, దాదాపు 3200 దరఖాస్తులు స్వీకరించామన్నారు.



దరఖాస్తుల్లో 50 శాతానికి పైగా సాదా బైనామ కి సంబంధించి ఉన్నాయని, కోర్ట్ లో సాదా బైనామ కి సంబంధించి కేస్ వెకేట్ కాగానే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. జూన్ 2 నాటికి మొదటి విడత పైలట్ మండలాల అన్ని సమస్యలు, రెండో విడత 28 మండలాల్లో సత్వర పరిష్కార సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. సాగుయోగ్యమైన అసైన్డ్ భూముల్లో ఉన్న కడు పేదవారికి పట్టాలు ఇస్తామన్నారు.
జూన్ 3 నుండి 20 వరకు భూ భారతిచట్టం ద్వారా రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం గ్రామాలకు వస్తుందన్నారు. ప్రతి భూ సమస్య పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధి తో పనిచేస్తారన్నారు.
రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం పేదవారికి ఇస్తుందని మంత్రి తెలిపారు. అందులో 1.95 లక్షల లబ్ధిదారులను ఇప్పటికే ఫైనల్ చేశామన్నారు. మిగతా 2.55 లక్షల లబ్ధిదారులను ఈ నెలాఖరుకు ఫైనల్ చేస్తామన్నారు. రాష్ట్రంలోని 9800 చెంచు, చెంచు ఉప కులాల కుటుంబాలన్నింటికి పూర్తిగా ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తామన్నారు. ఐటీడీఏ ప్రాంతాల్లోని గిరిజనులకు అదనంగా మరో 10 వేల ఇండ్లు ఇస్తామన్నారు. పైలట్ గా ప్రతి మండలం నుండి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి, 8 వేల ఇండ్లు నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఇండ్లు ప్రారంభించిన వారికి మొదటి విడత పేమెంట్ అందజేశామన్నారు. ప్రతి సోమవారం పేమెంట్ చేపడుతున్నట్లు తెలిపారు. జూన్ 2 న కనీసం వేయి ఇండ్లు నిర్మాణం పూర్తి చేసి, ప్రారంభోత్సవం చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే 34 సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామన్నారు.
లైసెన్స్ సర్వేయర్లకు నోటిఫికేషన్ ఇస్తే, రాష్ట్ర వ్యాప్తంగా 10 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. 50 పనిదినాల్లో వీరికి శిక్షణ ఇచ్చి, అనంతరం పరీక్ష పెట్టి, ఉత్తీర్ణత పొందిన వారిని లైసెన్స్డ్ సర్వేయర్ గా గుర్తిస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో 458 లైసెన్స్డ్ సర్వేయర్ కి దరఖాస్తు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, నిరుద్యోగ యువతకు ప్రతి నెల ఆదాయం వచ్చే విధంగా కార్యాచరణ చేస్తామన్నారు.
ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారైని నియమిస్తామని మంత్రి తెలిపారు. గతంలో విఆర్వో, విఆర్ఏ లుగా పనిచేసిన వారి నుండి అప్షన్లు తీసికొని, వారికి ఈ నెల 27న పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత పొందిన వారిని గ్రామ రెవెన్యూ అధికారిగా నియమిస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా, వచ్చిన ఆదాయంతో అప్పులు కడుతూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కాస్త ఆలస్యమైన ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి తెలిపారు.

### విశ్వాసానికి,ధైర్యసాహసాలకు ప్రతీక ఆంజనేయస్వామి

- **మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

**గురువారం ఆంజనేయస్వామి జయంతి సందర్భంగా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామములో ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.సంకల్పబలం మనోనిబ్బరానికి,విశ్వాసానికి ఆంజనేయస్వామి ప్రతిరూపం అని నేటి యువత ఆంజనేయుని ఆదర్శంగా తీసుకొని సమాజములో భక్తిప్రభతులతో పాటు ఆత్మస్థైర్యం పెంచుకొని ముందుకు సాగాలని అన్నారు. నిరంజన్ రెడ్డినీ ఆలయ కమిటీ సాదరంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమములో మాజీ ఎం.పి.పి మన్నెపురెడ్డి,చిట్యాల.రాము గ్రామస్థులు పాల్గొన్నారు.**



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







# పార్టీకి విధేయుడు కొలిపాక

స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు

జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ కు చెందిన కొలిపాక సతీష్ కాంగ్రెస్ పార్టీ యే ప్రాణంగా సేవే లక్ష్యంగా, పని చేస్తూ పార్టీతో పార్టీలో ఉన్న నాయకులతో బల కార్యకర్తలతోనూ మమేకమై పనిచేసే మృదు స్వభావి కష్టకాలంలో కూడా పార్టీకి విధేయుడుగా ఉంటూ ప్రజల మధ్యన ఒక సాధారణమైన జీవితం గడుపుతూ తన కష్టార్జితములో తోటి వారికి సహాయపడే మంచి గుణం కలిగిన వ్యక్తిగా పార్టీ పెద్దలు పదవులు ఇస్తామని పనులు ఇస్తామని చెప్పిన పదవుల కోసం కాకుండా పార్టీ కోసమే పని చేస్తూ కరుడుగట్టిన కాంగ్రెస్ కార్యకర్తగా ఎదిగారు కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకున్నా ఆ పార్టీ జెండాను భుజాన వేసుకుని పార్టీ కోసం పనిచేసే నిజమైన నాయకుడు కొలిపాక సతీష్

**కుటుంబ నేపథ్యం**

స్టేషన్ ఘనాపూర్ లో నాయి బ్రాహ్మణ కుటుంబంలో సరోజన నరసయ్య లకు 1978లో సతీష్ జన్మించారు వీరిది నాయి బ్రాహ్మణ కుటుంబ నేపథ్యం కావున కులవృత్తి అయిన కటింగ్ షాపు నడిపించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు సతీష్ దంపతులకు ఒక కుమార్తె కుమారుడు ఉన్నారు, సతీష్ నాన్నగారైన నరసయ్య చనిపోయిన సమయంలో సొంత నివాసం కూడా లేక అనేక కష్టాలు పడ్డారు, దైనందిన జీవితం గడుపుతూ పొద్దంతా కష్టపడితే వచ్చిన డబ్బులలో పార్టీ కార్యక్రమాలు ఏదైనా ఉంటే వాటికే ఖర్చు పెట్టి వట్టి చేతులతో ఇంటికి వచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి నమ్ముకున్న పార్టీని జెండాని వదలకుండా విధేయుడుగా ఉంటూనాడు.

**విద్యార్థి నాయకుడిగా తనదైన పాత్ర**

1998 నుండి 2002 వరకు స్టేషన్ ఘనపూర్ ఎన్.ఎస్.యు.ఐ మండల అధ్యక్షుడుగా, 2002 నుండి 2005 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాకి ఎన్.ఎస్.యు.ఐ ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, 2006 నుండి 2009 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ గా 2009 నుండి 2015 వరకు వరంగల్ జిల్లా



యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఉపాధ్యక్షుడిగా పనిచేసాడు, 2016 నుండి కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం వరంగల్ వెస్ట్ జోన్ ఇన్చార్జిగా పనిచేస్తున్నాడు.

దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆదర్శం ఇంటర్మీడియట్ వరకు చదివిన కొలిపాక సతీష్ 1998లో ఎన్.ఎస్.యు.ఐ నాయకుడిగా అరంగేట్రం చేసిన సతీష్ వైయస్ రాజశేఖర్ రెడ్డిని చూసి ఎంతగానో ప్రభావితమయ్యాడు రాజశేఖర్ రెడ్డి పట్టుదల, కృషి ప్రజల పట్ల ఆయనకున్న సేవ భావాని చూసి ముగ్ధుడైన సతీష్ రాజీవ్ గాంధీ కుటుంబం అంటే కూడా ఎంతో గౌరవం.

**డిగ్రీ కళాశాల కోసం ఆమరణ నిరాహార దీక్ష**

2003 సంవత్సరంలో స్టేషన్ ఘనాపూర్ నియోజకవర్గానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కావాలి అని ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నాడు దీనిపైన స్పందించిన అప్పటి మంత్రి కడియం శ్రీహరి డిగ్రీ కళాశాల మంజూరు చేపిస్తాను అని హామీ మేరకు కడియం శ్రీహరి ద్వారా నిమ్మరసం పుచ్చుకొని దీక్ష విరమించాడు.

**పార్టీకి విధేయత, పార్టీ కార్యక్రమాలు**

1998లో రాజకీయ ఆరంగేట్రం చేసిన కొలిపాక సతీష్ వివిధ స్థాయిలలో ఎన్.ఎస్.యు.ఐ నాయకుడిగా, అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సతీష్ కాంగ్రెస్ పార్టీలోనే నమ్మకంగా ఉంటూ పార్టీ ఇచ్చిన బాధ్యతని సక్రమంగా నెరవేర్చుతూ పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉంటాడు, పగలంతా తన సెలూన్ లో కష్టపడి వచ్చిన కొద్దిపాటి డబ్బులతో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ, రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జూడో యాత్రలో, దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్రలో, బట్టి విక్రమార్క, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాసే హాట్ భారత్ జూడో యాత్ర మొదలగు వాటిలో పాల్గొన్నాడు. ఇతర పార్టీలు డబ్బు కోసం పదవుల కోసం ప్రలోభాలు పెట్టినప్పటికీ ప్రలోభాలకి లొంగలేదు, ఇతర పార్టీల వారు పొరపాట్లు చేస్తే మీడియా సమావేశం నిర్వహించి వాటిని ఎప్పటికప్పుడు ఎండగడుతూనే చురకలు అంటిస్తాడు. స్టేషన్ ఘనాపూర్ లో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కావాలని, స్టేషన్ ఘనాపూర్ లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు అని, రోడ్లు సరిగా లేవని గత ప్రభుత్వం లో అప్పటి పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుని అడ్డుకొని నిరసన తెలియజేయడం జరిగింది, తరువాత నే డాక్టర్ రాజయ్య తో మంత్రి దయాకర్ రావు మాట్లాడి ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈరోజు స్టేషన్ ఘనాపూర్ లో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ పాస్, గాంధీ చౌరస్తా నుండి శివాజీ విగ్రహం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కొలిపాక సతీష్ కృషి ఎంతగానో ఉందని తెలిపారు. తెలంగాణ కోసం జాయింట్ ఆక్షన్ కమిటీని ఏర్పాటు చేసి స్టేషన్ ఘనాపూర్ నుండి తెలంగాణ సాధన కోసం తన వంతు కృషి చేశాడు. కాంగ్రెస్ పార్టీలో ఉండి పదవులు అనుభవించి పార్టీని వీడి వెళ్లిన వారు చాలామంది ఉన్నారు కానీ ఏనాడు నమ్ముకున్న పార్టీని జెండాని వదలకుండా కాంగ్రెస్ పార్టీకి విధేయత గా ఉంటూ వస్తున్నాడు, ఏ ఎన్నిక వచ్చిన కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం మాత్రమే పని చేస్తాడు, నియోజకవర్గస్థాయి నుండి ఢిల్లీ వరకు నాయకులతో మంత్రులతో మంచి సంబంధాలు కలిగి ఉంటాడు, స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ లో కొలిపాక సతీష్ ప్రత్యేక గుర్తింపు ఉంది. కొలిపాక సతీష్ అంటే కాంగ్రెస్, టుడేస్ పార్టీ అంటే అంటే కొలిపాక సతీష్.

**కొలిపక సతీష్ సామాజిక సేవలో ముందుంటాడు**

కొలిపాక సతీష్ పార్టీ కార్యక్రమాల లో చురుకుగా పాల్గొంటూనే తనదైన శైలిలో సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుంటాడు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తాడు, కార్యకర్తలు నాయకులు ఎవరైనా అనారోగ్యంగా ఉంటే వెళ్లిన వారిని పరామర్శించి వారి బాగోగులను తెలుసుకుంటాడు, పగలంతా సెలూన్ లో కష్టపడి వచ్చిన డబ్బులతో పేదవారికి తన వంతు సహాయంగా తనకు ఉన్నంతలోనే వారికి సహాయం చేస్తాడు, వట్టి చేతులతో ఇంటికి వెళ్లిన రోజులు ఎన్నో ఉన్నాయి. కరోనా సమయములో కూడా గూడు లేని నిరుపేదలకు ఆహారాన్ని మజ్జిగ ప్యాకెట్లని, అరటి పళ్ళు, కూరగాయలని అందించి వారిని ఆదుకున్నాడు, విద్యార్థులకు పరీక్షల సమయంలో పెన్ను పెన్సిల్ పేర్లని ప్రతి ఏటా అందిస్తూనే ఉంటాడు. ప్రైవేటు పాఠశాల, కళాశాలలో చదివే పేద విద్యార్థులకు ఫీజులు కట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి.

**సతీష్ ని వరించిన జాతీయ సేవా రత్న అవార్డు**

కొలిపక సతీష్ స్టేషన్ ఘనాపూర్ లో మున్సిపాలిటీ సిబ్బందికి దుస్తులు అందించడంలో కావచ్చు, పిల్లలకి నోట్ బుక్స్ పెన్స్ ప్యాడ్స్ అందించడం, హాస్పిటల్స్ లో ఉన్నవారికి పండ్ల పంపిణీ చేయడం, నిరుపేద విద్యార్థులకు ఫీజులు కట్టడం, కరోనా సమయంలో గూడు లేని నిరుపేదలకు కరోనా సోకిన వారికి పండ్లు గుడ్లు, కూరగాయలు అందించి వారిని ఆదుకోవడం, వీటన్నింటినీ గుర్తించిన ప్రభుత్వం ఇటీవలే తిరుపతిలో జాతీయ సేవా రత్న అవార్డు ప్రధానం చేయడం జరిగింది

# తెలంగాణకు జీవనాడి కాళేశ్వరం, ఇది దేశానికే గర్వకారణం

- **మాజీ ఎంపీ నామ**

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల సాగునీటి పథకమని, దీని నిర్మాణంలో అక్రమాలు జరిగాయనే నిందారోపణలతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు నోటీసులు జారీ చేయడం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు అన్నారు. దేశానికి గర్వకారణంగా, తెలంగాణ రాష్ట్రానికి జీవనాడిగా నిలిచిన ఈ ప్రాజెక్టు లక్షల ఎకరాల బీడు భూములకు సాగునీరందించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే కాక ప్రజల దాహార్తి తీర్చిన ప్రాజెక్ట్ కాళేశ్వరం అని నామ వివరించారు. కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కేంద్ర ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు సాధించి భారత దేశ నీటి పారుదల రంగంలో సరి కొత్త రికార్డులు సృష్టించిందన్నారు. దీని వల్ల భూగర్భ జలాలు పెరగడంతో రైతులు మూడు పంటలు సాగుచేసే స్థితికి చేరుకున్నారన్నారు. ఈ ప్రాజెక్టు విశిష్టత గురించి తాను పలుమార్లు 17వ లోక్ సభ లో మాట్లాడటం జరిగిందని, దీనికి జాతీయ హోదా కల్పించి నిధులు కేటాయించాల్సిన



అవసరం గురించి వివరించానని ఒక ప్రకటనలో నాగేశ్వరరావు పేర్కొన్నారు. దేశంలో నీటి కొరత రాకుండా నదుల అనుసంధానం విషయంలో జాతీయ స్థాయిలో ఒక విధానాన్ని తీసుకురావాలని తాను కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా నామ గుర్తు చేశారు. రైతన్నల కడగండ్లు తీర్చిన కాళేశ్వరం ప్రాజెక్ట్ సృష్టికర్త కేసీఆర్ పాలనలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని తక్కువచేసే ప్రయత్నాలు, కుట్రలను ప్రజలు ఏ మాత్రం అంగీకరించరని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు, ఇక ముందు కూడా తెలంగాణ రాష్ట్రానికి, ప్రజలకు గర్వ కారణంగా నిలుస్తుందని నామ నాగేశ్వరరావు వివరించారు.



# రాజీవ్ యువ వికాసం పక్కాగా అమలు అవ్వాలి

- **అధికారుల సమీక్ష సమావేశంలలో ఎమ్మెల్యే మేఘారెడ్డి**

వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:

నిరుద్యోగ యువత యువకుల ఉపాధి అవకాశాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని క్షేత్రస్థాయిలో పక్కాగా అమలయ్యేలా చూడాలని వనపర్తి శాసనసభ్యులు తూడిమేగా రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి దరఖాస్తులను పరిశీలించాలని.అర్హత గల ప్రతి ఒక్కరికి యువ వికాస పథకం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆయన వారికి సూచించారు.ప్రతి గ్రామం నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలన్నారు అందులో కేటగిరి వైజ్ గా విభజించి విచారిస్తే సులభంగా ఉంటుందని ఆయన అధికారులకు సూచించారు.నిరుద్యోగ యువతీ యువకులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం 6600 కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు .ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల కలెక్టర్ యాదయ్య, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి అఫ్జలుద్దీన్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఉమాదేవి, బీసీ కార్పొరేషన్ అధికారి పాండురంగ రావు, ఎస్సీ కార్పొరేషన్ సంక్షేమ శాఖ అధికారి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా కమిటీ ఎన్నిక

**-జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా మారగాని లక్ష్మీనారాయణ, కోనేసి శ్రావణి నాయుడు**

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా మారగాని లక్ష్మీనారాయణ కార్యదర్శిగా కోనేసి శ్రావణి నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో జరిగిన ప్రత్యేక ఉపాధ్యాయుల సమావేశంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ప్రత్యేక ఉపాధ్యాయులకి ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాలు హక్కుల సాధనకై కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం శివకుమార్ టీ రవికుమార్ కోశాధికారి వై సూరయ్య ఉపాధ్యక్షులు వి వీరన్న సంయుక్త కార్యదర్శి పి నరేష్ గౌరవ సలహాదారులు ఇ నరేష్ ఎం కృష్ణయ్య ఎన్ మహేష్ ఎం చంద్రావతి ఇతర ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.









# జర్నలిస్టుల స్వేచ్ఛ హరిస్తే ఊరుకోం..!

- **బెదిరింపు చర్యలకు దిగితే సహించం**
- **త్వరలో ఫెడరేషన్ ఖమ్మం జిల్లా మహాసభ**
- **టీడబ్ల్యూజేఎఫ్ పాలేరు నియోజకవర్గ సభ్యత్వ నమోదు సభలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నాయకులు ఖదీర్, కృష్ణ**

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

జర్నలిస్టుల స్వేచ్ఛ హరిస్తే ఊరుకోమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా నాయకులు సయ్యద్ ఖదీర్, జక్కంపూడి కృష్ణ హెచ్చరించారు. జర్నలిస్టులపై బెదిరింపు చర్యలకు పాల్పడితే సహించమన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా జర్నలిస్టులకు టీడబ్ల్యూజేఎఫ్ అండగా ఉంటుందన్నారు. కూసుమంచిలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు సభలో వారు మాట్లాడారు. ఏ జర్నలిస్టు ఏ యూనియన్ లో ఉండాలి అనేది వారి వ్యక్తిగత అంశమని, జర్నలిస్టుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా కొన్ని యూనియన్లు వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. అటువంటి యూనియన్లకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అదిరిస్తూ ...బెదిరిస్తూ ఎంతో కాలం జర్నలిస్టులను చెప్పుచేతల్లో ఉంచుకోలేమన్నారు. జర్నలిస్ట్ సోదరులు ఫెడరేషన్ లో సభ్యత్వం పొందేందుకు వస్తున్న క్రమంలో ఆయా జర్నలిస్ట్ సంఘాల నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోందన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ పోరాట స్ఫూర్తితో జర్నలిస్టులు తమ సంఘం వైపు ఆకర్షితులవుతున్న నేపథ్యంలో వక్రమార్గంలో నియంత్రించే చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ లో చేరుతున్నారనే కారణంతో ఏ ఒక్క జర్నలిస్ట్ నైనా విధుల నుంచి తొలగిస్తే... అవసరమైతే యాజమాన్యాలతో మాట్లాడి వారికి అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాల్సిన యూనియన్లు ఇలాంటి కుట్రపూరిత వైఖరితో జర్నలిస్టులను నియంత్రించడం ఇకమీదట సాగనీయమని అన్నారు. త్వరలో తన సంఘం జిల్లా మహాసభ అంగరంగ వైభవంగా జరగనుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా తమ ఫెడరేషన్ ముందుకు సాగుతోందని తెలిపారు. ఐక్యత, క్రమశిక్షణ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం అంశాలలో ఫెడరేషన్ చూపుతున్న చొరవతో టీడబ్ల్యూజేఎఫ్ ను ఆదరించేందుకు జర్నలిస్టు లోకం సిద్ధంగా ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యలపై టీడబ్ల్యూజేఎఫ్ సాగించిన పోరాటాలను వివరించారు. ఆయా పత్రిక, చానళ్ల లలో తమ జిల్లా ప్రతినిధుల ఒత్తిడిలతోనే తమ హక్కులు కాలరాయ బడుతున్నాయని వస్తున్న ప్రచార మాధ్యమాల సమాచారాలు తమను విస్మయానికి గురి చేశాయని అన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నికార్సుగా పాటుపడేది టీడబ్ల్యూజేఎఫ్ మాత్రమే అని అభివర్ణించారు. జర్నలిస్టుల ఆరోగ్య, పిల్లల విద్యాపరమైన అంశాల్లో టీడబ్ల్యూజేఎఫ్ చూపుతున్న చొరవపై ప్రశంసలు అందుకుంటోందని చెప్పారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు విక్రమ్ రావు, ఆర్మీ వీరులకు, అమరవీరులకు సమావేశం సంతాపం ప్రకటించింది. ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా నాయకులు కూరపాటి గోపి, యెగినాటి మాధవరావు, మానుకొండ రవి కిరణ్, కొత్త యాకేశ్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, ఎస్ కే జానీపాషా, కె. వెంకటేశ్వరరావు, పెంద్ర అంజయ్య, యాస లక్ష్మారెడ్డి, నాగిరెడ్డి, కొల్లి హరీష్, గోవిందరెడ్డి, కర్ణబాబు, వీ6 కర్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ చదువులు భారమేనా!



ప్రైవేటు బడి ఫీజు భారమైంది. అక్షరాలు దిద్దించడానికే లక్షలు దాటింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా స్కూల్ ఫీజులు గణనీయంగా పెరిగాయి. 5% దాటని ధనవంతుల సంగతి పక్కనపెడితే మిగతా 95% మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలు ఈ ఆర్థిక భారం మోయలేక పిల్లలకు మంచి చదువులు చెప్పించలేక మనోవేదనకు గురవుతున్నారు. బెంగళూరు నుంచి ఢల్లీవరకు సర్వత్రా ఇదే పరిస్థితి. ముఖ్యంగా గత మూడేళ్లలో స్కూల్ ఫీజులు అనేక రెట్లు పెరిగాయని స్కూల్ పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా పాఠశాల ఫీజులు మూడు ఏళ్లలోనే 50 నుంచి 80 శాతం పెరిగాయని తాజా జాతీయ సర్వే సైతం నిర్ధారించింది. స్కూల్ ఫీజులపై ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఇష్టారీతిగా ఏటా ఫీజులు పెంచుకుంటూ వెళ్తున్నారు. దీంతో పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులకు తడిసి మోపెడవుతున్నది. కమ్యూనిటీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయిన లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో 44 శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుతున్న పాఠశాలలో గత మూడేళ్లలో ఫీజులు 50 నుంచి 80 శాతం పెరిగాయని చెప్పినట్లు సర్వే నివేదిక వెల్లడిరచింది. దేశవ్యాప్తంగా ఉన్న 309 జిల్లాల్లోని 31 వేల మంది స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులపై ఈ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో పాల్గొన్న దాదాపు 93 శాతం మంది తల్లిదండ్రులు పాఠశాలల అధిక ఫీజుల నియంత్రణపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆశలను అవకాశంగా మలుచుకున్న ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు వివిధ పేర్లతో బురిడీ కొట్టిస్తున్నాయి. దీంతో అత్యాశకుపోయి లక్షలు కుమ్మరిస్తూ భారం భరిస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా స్కూల్ ఫీజులు గణనీయంగా పెరిగాయి. ఒకప్పుడు గ్రామర్, కాన్సెప్ట్ స్కూళ్లు అంటేనే అదేదో బ్రహ్మ పదార్థంలా చూసేవారు.

ఇప్పుడు కాన్సెప్ట్ పోయి టాలెంట్, టెక్నో, ఇ టెక్నో, డిజి, మోడల్ స్కూల్, ఐఐటి, జెఇఇ, సివిల్స్ ఫౌండేషన్ అంటూ తల్లిదండ్రులను ఊహా లోకంలోకి తీసుకెళ్లేందుకు పాఠశాల యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి. ఎలాంటి అనుమతి లేకుండా ఏటా 20 నుంచి 30% ఫీజులను యాజమాన్యాలు యథేచ్ఛగా పెంచుతూ వెళ్తున్నాయి. జీవో నెంబర్ 91 ప్రకారం దరఖాస్తు రుసుం రూ. 100, అడ్మిషన్ ఫీజు రూ. 500 మాత్రమే తీసుకోవాలి. పాఠశాలలో పుస్తకాలు, విద్యా సామగ్రిని కొనుగోలు చేయాలన్న నిబంధనలు పెట్టరాదు. సెక్షన్ 8(1) ప్రకారం విద్యా సంస్థ పేర్లకు ఇంటర్నేషనల్, ఐఐటి, ఒలంపియాడ్, కాన్సెప్ట్, ఇ టెక్నో వంటి పదాలను చేర్చకూడదు. జిఒ 88 ప్రకారం 200 మంది విద్యార్థులు చదివే పాఠశాలలో 700 చదరపు మీటర్ల విస్తీర్ణంలో క్రీడా మైదానం ఉండాలి. అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. అగ్నిమాపక సామగ్రిని అందుబాటులో ఉంచాలి. కానీ ఏ ఒక్క కార్పొరేట్ విద్యా సంస్థల్లో అగ్నిమాపక సామగ్రిని పెట్టడం లేదు. కనీసం నోటీసు బోర్డుపై ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేస్తామో కూడా చెప్పకుండా, పరిమితి లేకుండా ఫీజులను వాళ్లే నిర్ణయించేస్తున్నారు. చాలా పాఠశాలల్లో ఎత్తయిన గోడలు, ఎసి తరగతి గదులు, ప్రత్యేకమైన టేబుళ్లు, కుర్చీలు, ఎసి బస్సులు, డిజిటల్ బోర్డులు, డిజిటల్ మెటీరియల్ చూపి, భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. సాధారణంగా, టైర్ 1, టైర్ 2 నగరాల్లో ప్రైవేట్ స్కూళ్ల ట్యూషన్ ఫీజులు ప్రతి నెలా రూ. 2,500 నుండి రూ. 8,000 వరకు ఉంటాయి. కొన్ని స్కూళ్లు వార్షిక ఫీజులు కూడా విధిస్తాయి. ఇవి ఒక్కో స్కూల్‌కి ఒక్కో విధంగా ఉంటాయి. ఉదాహరణకు ముస్సోరీలోని వుడ్‌స్టాక్ స్కూల్ భారతదేశంలో అత్యంత ఖరీదైన పాఠశాలలలో ఒకటి. వార్షిక ఫీజులు రూ. 18 లక్షలకు చేరుకుంటున్నాయి. ప్రైవేట్ స్కూల్ ఫీజులు తల్లిదండ్రులకు ఒక ప్రధాన అంశం. ఫీజులు చాలా ఎక్కువగా ఉండటం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చేర్చడానికి వెనకడుగు వేస్తున్నారు.

కొన్ని రాష్ట్రాలు, నగరాలు ఫీజులను నియంత్రించడానికి చట్టాలు, నిబంధనలు తీసుకువచ్చాయి. కానీ మన రాష్ట్రంలో విద్యా కమిషన్ వున్నా స్కూల్ ఫీజులలో ఎటువంటి మార్పు లేదు. విద్యార్థుల నుండి తీసుకున్నటువంటి ఫీజులో పాఠశాల నిర్వహణ, విద్యుత్, అద్దె ఖర్చులు, 15 శాతం స్కూల్ అభివృద్ధికి ఉపయోగించాలి. 15 శాతం ఫీజును స్కూల్ సిబ్బందికి బీమా, భవిష్య నిధి కోసం కేటాయించాల్సి ఉంటుంది. 2008 జిఒ నెం. 90, 91, 92 ప్రకారం ఫీజు నిర్ణయించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి, ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, విద్యార్థి సంఘాలు, ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధితో కమిటీని ఏర్పాటు చేయాలి. దీనికి కలెక్టర్ చైర్మన్‌గా ఉండాలి. ఈ కమిటీ పాఠశాలను పరిశీలించి మౌలిక సదుపాయాలు, పరిస్థితి చూసి ఎంత ఫీజులు వసూలు చేయాలనే విషయమై నివేదిక ఇస్తుంది. దీనిపై విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే ప్రభుత్వపరంగా ఓ ప్రకటన విడుదల చేయాలి. జిఒ నెంబర్ 42 ప్రకారం ఫీజులను పెంచాలంటే జిల్లా ఫీజ్ రెగ్యులేషన్ కమిటీ అనుమతి తీసుకోవాలి. రోజురోజు ఫీజులు పెంచుతున్నారు తప్ప తగ్గించడం లేదు. ఫీజుల నియంత్రణ, టీచర్ల నియామకం, డొనేషన్ల వసూలు వంటి అంశాల్లో విద్యా హక్కు చట్టం చాలా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినా వాటిని పాటించడం చాలా ప్రైవేట్ పాఠశాలల్లో కనిపించడం లేదు. చట్టాన్ని ఉల్లంఘిస్తే భారీగా జరిమానాలు విధించేలా చర్యలు తీసుకోవాలని విద్యా నిపుణులు డిమాండ్ చేస్తున్నారు. ప్రవేశ పరీక్షల పేరుతో డొనేషన్లు వసూలు చేస్తే రూ. 25,000 నుండి రూ. 50,000 వరకు జరిమానా విధించేలా చట్టంలో నిబంధనలు ఉన్నాయి. అంతేకాకుండా ప్రతి ప్రైవేట్ పాఠశాలలో కనీసం 25 శాతం సీట్లు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలన్న నిబంధన విద్యా హక్కు చట్టంలో ఉంది. కానీ దీనిపై కూడా పర్యవేక్షణ లేదు. ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. చట్టాన్ని ఉల్లంఘించే స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండా విద్యా వ్యవస్థను నడిపే దిశగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. సెక్షన్ 12 ప్రకారం స్కూల్ స్టాఫ్ సెలక్షన్ కమిటీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం టీచర్లను, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించి వారి వివరాలు, విద్యార్హత, వారికి ఇచ్చే వేతనాల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలని చట్టం చెబుతుంది. సెక్షన్ 12 ప్రకారం టీచర్ విద్యార్థుల నిష్పత్తి 1:20 కి మించరాదు. చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు యాజమాన్యం 25% సీట్లను ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు, మైనారిటీలకు కేటాయించాలి. ఇవే కాకుండా పాఠశాలల్లో మున్సిపాలిటీ పరిధిలో అయితే 1000 చదరపు మీటర్ల ఆట స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 2000 చదరపు మీటర్ల ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలి. కానీ ఇప్పుడు ఉన్నటువంటి ప్రైవేటు పాఠశాలలు దేన్నీ పాటించడం లేదు. ప్రతి సంవత్సరం తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, విద్యావేత్తలు, మేధావులు, అధికారులు సభ్యులుగా ఉన్నటువంటి ఫీ రెగ్యులేషన్ కమిటీ ఫీజులను నియంత్రణ చేసే నియంత్రణ వ్యవస్థ ఉండాలి. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులను ధిక్కరించిన సంస్థలపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వం కఠిన చట్టాలు రూపొందించాలి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, చిన్న విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా ఉద్యమం చేపట్టినటువంటి బాధ్యత ఉంది. ఈ విధంగా చేసినట్లయితేనే అధిక ఫీజులను వసూలు చేయకుండా ఉంటుంది. ఫీజులను కొంతమేరకు నియంత్రించవచ్చు.

## ఎవరెస్ట్‌ను అధిరోహించిన తొలి భారతీయ మహిళ

బచేంద్రి పాల్ అనే సాధారణ హిమాలయ గ్రామ యువతి, అసాధారణమైన లక్ష్యాన్ని గమ్యంగా చేసుకొని, దేశానికి గర్వకారణంగా నిలిచింది. మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించిన తొలి భారతీయ మహిళగా ఆమె చరిత్రలో నిలిచారు. ఆమె పర్వతారోహణ కేవలం ఒక భౌతిక ప్రయాణం కాదు, అది ఆమె సంకల్పానికి, ధైర్యానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఘనకథ. ఆమె జీవితం అనేకమంది యువతకు, ముఖ్యంగా యువతులకి, అసాధ్యమని కనిపించే కలలకూ రూపమివ్వాలనే సందేశాన్ని ఇస్తుంది. 1954 మే 24న ఉత్తరా ఖండ్ రాష్ట్రంలోని ఉత్తర కాశీ జిల్లా నకురి అనే గ్రామంలో బచేంద్రి పాల్ జన్మించారు. ఆమె తండ్రి కిషన్ సింగ్ పాల్ ఒక చిన్న వ్యాపారి. తల్లి హన్స దేవి. ఐదుగురు పిల్లలలో బచేంద్రి మూడవది. బాల్యంలోనే ఆమెకు పర్వతాల పట్ల ప్రత్యేకమైన ఆకర్షణ ఉండేది. కొండల మీదకి ఎక్కడం, ప్రకృతిని అన్వేషించడం ఆమెకు చురుకైన అలవాటుగా మారి పోయింది. ఈ సాహస గుణమే ఆమెను ముందుకు నడిపించింది. పాఠశాల విద్య పూర్తి చేసిన తర్వాత డెహ్రాడూన్‌లోని డిఎవి కాలేజీలో ఎం.ఎ. పూర్తిచేశారు. ఆమెకు కేవలం చదువులో మాత్రమే కాదు, కరాటే, షూటింగ్ వంటి క్రీడల్లోనూ ప్రతిభ ఉంది. పర్వతారోహణలో ఆమెను అత్యుత్తమ శిక్షణ పొందేందుకు నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్, ఉత్తర కాశికి వెళ్లారు. అక్కడ ఆమెను అద్భుతమైన విద్యార్థిగా గుర్తించి పురస్కారాలు అందించారు. 1982లో గంగోత్రి I (21,900 అడుగులు) మరియు రుద్రగైరా (19,091 అడుగులు) శిఖరాలను అధిరోహించడం ద్వారా ఆమె తన సాహసాలకు నిజమైన ప్రారంభం ఇచ్చారు. ఈ విజయాలు ఆమెలో మరింత నమ్మకాన్ని పెంచాయి. 1984లో భారత ప్రభుత్వం "ఎవరెస్ట్ '84" అనే ప్రత్యేక పర్వతారోహణ దళాన్ని ఏర్పరచింది. మహిళలతో కూడిన ఈ బృందంలో బచేంద్రి పాల్ ఎంపికయ్యారు. అనేక వారాల పాటు జరిగిన శారీరక శిక్షణ, పరీక్షలు ఆమెకు సవాళ్లే అయినా, ఆమె సంకల్పాన్ని దిగమింగ లేకపోయాయి. చివరకు 1984 మే 23న %-% తన 30వ పుట్టినరోజు ముందు రోజు - బచేంద్రి పాల్ 29,032 అడుగుల ఎవరెస్ట్ శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి దేశానికి ఒక గర్వకారణమైన ఘనతను అందించారు. ఆమె ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళ మాత్రమే కాక, ప్రపంచంలో మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించిన ఐదవ మహిళగా కూడా గుర్తింపు పొందారు.ఈ యాత్ర అంత తేలికగా జరగలేదు. మంచు తుఫానులు, ఆకస్మిక వాతావరణ మార్పులు, కఠినమైన గాలులు ఆమెను పలుమార్లు వెనక్కి లాగినా, ఆమె లోపలి ధైర్యం, సంకల్పం ముందుకు నడిపించాయి. ఒకసారి శిఖరాన్ని చేరుకున్న తర్వాత, ఆమె కన్నీరు కార్చారు. అది గర్వ భరితమైన ఆనందానికి, దేశం కోసం చేసిన త్యాగానికి గుర్తుగా వెలిసిన కన్నీళ్లు. ఎవరెస్ట్ విజయంతో ఆమె జీవిత మార్గం పూర్తిగా మారింది. పర్వతారోహణ కేవలం ఆమె వ్యక్తిగత ప్రయాణంగా కాక, యువతకు స్ఫూర్తిగా మారే



సాధనగా మారింది. టాటా స్టీల్ అడ్వెంచర్ ఫౌండేషన్ సంస్థకు ఆమె డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి, వేలాది మందికి శిక్షణ ఇచ్చారు. ఆమె ఆధ్వర్యంలో మహిళల ప్రత్యేక ట్రెక్కింగ్ కార్యక్రమాలు, పర్వతారోహణ శిబిరాలు నిర్వహించ బడ్డాయి. 2008లో "మిషన్ గంగోత్రి" అనే ప్రచారం ద్వారా గంగోత్రి గ్లేసియర్ ప్రాంతంలో మహిళా సాధికారతపై అవగాహన కలిగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆమెకు అనేక గౌరవాలు, పురస్కారాలు అందించింది. 1984లో పద్మశ్రీ, 1986లో అర్జున అవార్డు, 1994లో నేషనల్ అడ్వెంచర్ అవార్డు, 2019లో పద్మ భూషణ్ వంటి ప్రతిష్ఠాత్మక బహుమతులు ఆమె ఘనతను చాటిచెప్పాయి. అంతేకాదు, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఆమెకు "వీరతా పురస్కార్", "సాహస రత్న అవార్డు" లభించాయి. ఆమె జీవితానుభవాలను "ఎవరెస్ట్ - మై జర్నీ టు ది టాప్" అనే పుస్తకంగా కూడా రచించారు. ప్రస్తుతం ఆమె ప్రారంభించిన "బచేంద్రి పాల్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ అకాడమీ" ద్వారా యువతకు శిక్షణనిచ్చేందుకు కృషి చేస్తున్నారు. బచేంద్రి పాల్ జీవితం ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా భారతీయ మహిళలకు ఒక మార్గదర్శకంగా నిలుస్తుంది. ఆమె చూపించిన దారిలో నడవాలనే తపన అనేక మందిలో రగిలిపోతుంది. ఆమె చూపించిన అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం, జాతిని గర్వపడేలా చేసిన సేవలు - ఇవన్నీ కలిపి ఆమెను భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిపాయి. ఆమె నామం, ఆమె సాధన, ఆమె విజయగాథ - ఇవన్నీ భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి.





## ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య బోధన


- మండల విద్యాధికారి బాణం విష్ణు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న మెరుగైన విద్యా బోధనతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పెద్దమందడి మండల విద్యాధికారి బాణం విష్ణు అన్నారు. పెద్దమందడి మండలం బలిజపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు 5 రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బాణం విష్ణు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో తెలుగు ,ఇంగ్లీష్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టులో బోధన విషయాలలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పెద్దమందడి బలిజపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మొత్తం 62 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారని అన్నారు .ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయి చరణ్ రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



ఖిల్లా ఘనపూర్ మండలం దొంతి కుంట తండా చెందిన మూడవత్ లక్ష్మణ్ నాయక్ కుమారుడి వివాహం గురువారం ఘనంగా జరిగింది. మూడవత్ లక్ష్మణ్ నాయక్ ఆహ్వానం మేరకు వివాహ వేడుకకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిచరణ్ రెడ్డి హాజరయ్యారు. వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో నూతన దాంపత్య జీవితాన్ని గడపాలని ఆశీస్సులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖిల్లా ఘనపూర్ యూవ నాయకులు ఆగారం ప్రకాష్, వనపర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణయ్య , వనపర్తి దిశా కమిటీ మెంబర్ రవి నాయక్,లక్ష్మణ్ నాయక్ పాల్గొని నూతున దంపతులను ఆశీస్సులు అందచేశారు.

## వరి ధాన్యాన్ని కొనుగోలు వేగవంతం చేయాలి

- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అకస్మాత్తుగా తనిఖీ..
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.

**మెదక్ జిల్లా బ్యూరో/ టేక్మాల్ తెలంగాణ ముచ్చట్లు:**



జిల్లాలోని మొత్తం 498 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 120 ధాన్యం కొనుగోలు సెంటర్లలో కొనుగోలును పూర్తిగా ముగించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అకస్మాత్తుగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం దాన్యం కొనుగోలు విధానం మద్దతు ధర అమలు అవుతున్న తీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా వరి ధాన్యం సెంటర్లలో కొనుగోలు ప్రక్రియ ను స్వయంగా వరి ధాన్యాన్ని పరిశీలించి తేమ శాతం వచ్చిన ధాన్యన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగవంతమైన ధాన్యం కొనుగోలు జరగాలని తూకంలో పారదర్శకత ఉండాలని తడిపడిన వరి ధాన్యాన్ని తిరస్కరించకూడదని స్పష్టం చేశారు. అలాగే తక్షణమే డబ్బులను రైతుల ఖాతాలలో జమ జమ చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి కొనుగోలును వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ట్యాగ్ చేసిన వరి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్న తీరును వరి కొనుగోలు సెంటర్ల నిర్వాహకులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు లో గణనీయమైన వృద్ధి దిశగా ముందుకు పోతున్నట్లు చెప్పారు.

ఈరోజు వరకు 2.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, గత సంవత్సరం ఇదే సమయం ఇదే రోజు వరకు 2.22 లక్షల వరి ధాన్యం మాత్రమే కొనుగోలు చేసినట్లు వివరించారు.

గత సంవత్సరంతో పోలిస్తే 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా త్వరగా కొనుగోలు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వివరించారు. అధిక వర్షాలను దృష్టిలో పెట్టుకుని గడిచిన వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని తరలించడానికి 100 లారీలను అదనంగా సమకూర్చుకొని, ఈరోజు నుంచి సిద్దిపేట జిల్లాకు మరో 50 లారీలను

సిద్ధం చేసుకుని మొత్తం 730 లారీల ద్వారా కొనుగోలు కేంద్రాల ధాన్యం తరలించడానికి అందుబాటులో ఉంచామని జిల్లా కలెక్టర్ చెప్పారు. వర్షాలను దృష్టిలో పెట్టుకుని సిద్దిపేట జిల్లాకు 30వెయ్యి మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలోని మొత్తం 498 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 120 ధాన్యం కొనుగోలు సెంటర్లలో కొనుగోలను పూర్తిగా ముగించినట్టు తెలిపారు

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటూ జిల్లాలో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతులకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఈకార్యక్రమంలో తాసిల్దార్ తులసి రామ్, ఏపియం శకుంతల రెడ్డి, ఆర్ఐ సాయి శ్రీకాంత్, ఐకేపి సిసి దుర్గయ్య, వరి ధాన్యం సెంటర్ నిర్వాహకులు ఆంజనేయులు, రైతులు తదితరులు ఉన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పంటి నొప్పితో ఇబ్బందిగా ఉందా..?




పంటి నొప్పి అనేది మామూలు సమస్య అనిపించవచ్చు. కానీ అది కలిగించే ఇబ్బంది మాత్రం చాలా ఎక్కువగా ఉంటుంది. ఒకసారి నొప్పి మొదలైతే తినడం, మాట్లాడడం, నిద్రపోవడం అన్నీ కష్టమవుతాయి. ఈ సమయంలో తీసుకునే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఎందుకంటే కొన్ని పదార్థాలు పంటి నొప్పిని పెంచే ప్రమాదం కలిగి ఉంటాయి. మీ దంతాలలో నొప్పి ఉంటే.. ముందుగా తీపి పదార్థాల నుండి దూరంగా ఉండటం అవసరం. చాక్లెట్లు, స్వీట్లు, బిస్కెట్లు వంటి వాటిలో ఉండే చక్కెరలు బ్యాక్టీరియా పెరగడానికి కారణమవుతాయి. ఇవి పళ్ళపై దాడి చేసి క్యావిటీ ఏర్పడేలా చేస్తాయి. దీంతో నొప్పి ఇంకా ఎక్కువవుతుంది. ముఖ్యంగా నిద్రకు ముందు ఈ పదార్థాలు తీసుకోకపోవడం మంచిది. ఐస్ వాటర్, సోడా, కోల్డ్ డ్రింక్స్, ఐస్ క్రీమ్ లాంటివి తాగడం వల్ల మీ పళ్ళలోని నరాలపై దెబ్బ పడుతుంది. ఇది కొన్ని సందర్భాలలో తీవ్రమైన నొప్పికి దారి తీస్తుంది. ముఖ్యంగా టూత్ సెన్సిటివిటీ ఉన్నవారు చల్లటి పదార్థాలను పూర్తిగా వదిలేయాలి. నారింజ, మామిడిపండు, ద్రాక్ష వంటి పుల్లటి పండ్లు ఆమ్లపదార్థాలతో నిండి ఉంటాయి. ఇవి పళ్ళ ఉపరితలాన్ని నెమ్మదిగా దెబ్బతీయడమే కాకుండా నొప్పిని పెంచే అవకాశమూ ఉంది. అందువల్ల పంటి సమస్యలు ఉన్నవారు ఈ రకమైన పండ్లను తినకుండా ఉండాలి. పళ్ళలో నొప్పి ఉన్నప్పుడు గట్టి పదార్థాలను నమలడం వల్ల నొప్పి మరింత తీవ్రమవుతుంది. క్యారెట్, బీట్ రూట్ వంటి కూరగాయలు, అలాగే చికెన్ లేదా మటన్ ముక్కలను నమలడం వల్ల పళ్ళకు ఒత్తిడి పెరుగుతుంది. ఇది నొప్పిని మించిపోయేలా చేస్తుంది. వీటిని మెత్తగా వండుకుని, ముద్దలా చేసుకుని తినడం మంచిది. పంటి నొప్పిని తగ్గించుకోవాలంటే మీ బ్రషింగ్ పద్ధతిలోనూ మార్పులు చేయాలి. గట్టిగా బ్రష్ చేయడం వల్ల పళ్ళు మరింత సున్నితంగా మారతాయి. అందుకే సాఫ్ట్ బ్రిస్టల్ బ్రష్ ఉపయోగించాలి. అలాగే వేడి, చల్లటి పదార్థాలను కలిపి తినకూడదు. గోరువెచ్చటి పదార్థాలు మాత్రమే తీసుకోవడం వల్ల ఉపశమనం కలుగుతుంది. పంటి నొప్పి అనేది చిన్న సమస్యగా కనిపించినా సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే అది పెద్ద ఇబ్బంది కావచ్చు. తీపి పదార్థాలు, చల్లటి పానీయాలు, పుల్లటి పండ్లు, గట్టి ఆహార పదార్థాల్ని పూర్తిగా మానేయడం ద్వారా నొప్పిని నియంత్రించుకోవచ్చు. అలాగే రోజువారీ ఆహారపు అలవాట్లలో మార్పులు చేసి శుభ్రత పాటించడం వల్ల మీరు ఈ సమస్యను త్వరగా అదుపులోకి తీసుకురాగలరు.



## షుగర్ కంట్రోల్ కావాలంటే..!

డయాబెటిస్ ఒక దీర్ఘకాలిక వ్యాధి. ఒక్కసారి వచ్చిందంటే బాధితులు జీవితాంతం చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకునే ప్రయత్నాలు చేయాలి. ప్రస్తుత కాలంలో డయాబెటిస్ అనేది అతి పెద్ద ముప్పుగా మారింది. డయాబెటిస్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా చాలామంది ఈ షుగర్ వ్యాధితో బాధపడుతున్నారు. కానీ, జీవన శైలి మార్పులు, చిన్నపాటి ఆహారపు అలవాట్లు పాటిస్తే డయాబెటిస్ బారిన పడకుండా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు. మధుమేహం ఉన్నవారు తమ ఆహారం, పానీయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చాలామంది వైద్యులు సూచించిన మందులు తీసుకోవాలని తెలిసినప్పటికీ, పండుగలు వేడుకల పేరుతో తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు.. మధుమేహం ఉన్నవారికి మందులు, ఆహారం కాకుండా నడక ఉత్తమ ఔషధంగా వైద్యులు చెబుతున్నారు. షుగర్ బాధితులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నడిస్తే మీ చక్కెర స్థాయి ఎప్పటికీ పెరగదు. ప్రతిరోజూ కొంచెం నడవడం అలవాటు చేసుకోవడం మీ ఆరోగ్యానికి చాలా మంచిది. ముఖ్యంగా కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి దీనికంటే మంచి ఔషధం లేదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాకింగ్ అనేది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బరువు నిర్వహణను పెంచుతుంది. గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను నివారిస్తుంది. మధుమేహం ఉన్నవారికి కూడా వాకింగ్ ఒక అద్భుత నివారణ. క్రమం తప్పకుండా నడవడం వల్ల శరీరంలో ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. ప్రతిరోజూ ఒక గంట పాటు నడవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. ఇది కండరాలలో గ్లూకోజ్ తీసుకోవడం పెరగడానికి దారితీస్తుంది. మెరుగైన గ్లైసెమిక్ నియంత్రణకు దారితీస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడం, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడం ద్వారా శరీరంలో చక్కెర పెరుగుదలను నివారించడంలో నడక అనేది ప్రభావవంతంగా పనిచేస్తుంది. వాకింగ్‌తో చక్కెరను నియంత్రించడంలో మాత్రమే కాకుండా రక్తపోటును నిర్వహించడంలో, అధిక రక్తపోటును నియంత్రించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటుంది. ఇది హృదయ సంబంధ ప్రమాదాలను తగ్గిస్తుంది.



## కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే..!

అలా చేయడం వల్ల మూత్రం ద్వారా శరీరంలోని మలినాలు బయటకు వెళ్లిపోతాయని అంటున్నారు.. దీనివల్ల కిడ్నీ స్టోన్స్, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ల ముప్పు తగ్గుతుంది. ముదురు పసుపు పచ్చ రంగు మూత్రం, చాలా తక్కువగా మూత్రానికి వెళ్లడం, నోరు పొడిబారడం, అలసట మీరు డీహైడ్రేషన్‌కు గురయ్యారన్నదానికి సంకేతాలు అంటున్నారు.శరీరంలోని మలినాలను బయటకు పంపించే కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు ఓ పరిమిత మొత్తంలో నీళ్లు తాగాలని వైద్య ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. రోజుకు తగినంత నీళ్లు తాగితేనే కిడ్నీలు మలినాలను తొలగించి, శరీరంలో ద్రవాల స్థాయిని బ్యాలెన్స్ చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. ఇది సంపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడుతుందని అంటున్నారు. కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఒక ఆరోగ్యవంతమైన వ్యక్తి రోజుకు 2 నుంచి 3 లీటర్లు అంటే 8 నుంచి 12 గ్లాసుల నీళ్లు తాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అలా చేయడం వల్ల మూత్రం ద్వారా శరీరంలోని మలినాలు బయటకు వెళ్లిపోతాయని అంటున్నారు.. దీనివల్ల కిడ్నీ స్టోన్స్, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ల ముప్పు తగ్గుతుంది. ముదురు పసుపు పచ్చ రంగు మూత్రం, చాలా తక్కువగా మూత్రానికి వెళ్లడం, నోరు పొడిబారడం, అలసట మీరు డీహైడ్రేషన్‌కు గురయ్యారన్నదానికి సంకేతాలు అంటున్నారు. ఆరోగ్యకరమైన మూత్రం లేత పసుపు రంగులో ఉంటుంది. రోజుకు కనీసం ఆరు నుంచి 8 సార్లు మూత్రవిసర్జనకు వెళ్లడం ఆరోగ్యకరం. నీళ్లు మరీ ఎక్కువగా తాగినా ప్రమాదమే. అంటే రోజుకు 4 లేదా 5 లీటర్లకు మించి నీళ్లు తాగితే శరీరంలోని ముఖ్యమైన ఖనిజాలు కూడా బయటకు వెళ్లిపోతాయి. కిడ్నీలపై భారం కూడా పెరుగుతుంది. కిడ్నీల కోసం రోజూ కేవలం మంచి నీళ్లే ఎక్కువగా తాగడం మంచిది. షుగర్ ఎక్కువగా ఉన్న డ్రింక్స్, ఆల్కహాల్, అతిగా కెఫీన్ తీసుకోవడం కిడ్నీలను దెబ్బ తీస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.



## ఒక్క ముక్క తింటే చాలు.. నిద్ర బాగా పడుతుంది..!

నేటి కాలంలో నిద్రలేమి సమస్య సర్వసాధారణంగా మారిపోయింది. ఎందుకంటే.. చాలా మంది ఎంత ప్రయత్నించినా రాత్రిపూట నిద్రపట్టక అవస్థలు పడుతుంటారు. అలాంటి వారికి రాత్రంతా అటు ఇటు భూజాలను మారుస్తూ నిద్రలేమితోఆయాసపడుతూ ఉంటారు. అలాంటి వారికి ఆహారంలో కొన్ని మార్పులు చేయడం ద్వారా నిద్రలేమి సమస్యను పరిష్కరించవచ్చు అంటున్నారు వైద్య నిపుణులు. కొన్ని రకాల ఆహార పదార్థాలను తినడం ద్వారా నిద్రలేమి సమస్యను దూరం చేసుకోవచ్చు అని చెబుతున్నారు. అవకాడోలో కూడా మెగ్నీషియం లభిస్తుంది. పోషకాల పరంగా, అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. దీనిని నిమ్మకాయ మరియు ఉప్పుతో సలాడ్ లాగా తినవచ్చు లేదా సుగంధ ద్రవ్యాలతో గుజ్జు చేసి బ్రెడ్ మీద వ్యాప్తి చేయవచ్చు. దీన్ని సేవిస్తే రాత్రి పడుకున్న వెంటనే నిద్రపోతుంది. మఖానా మెగ్నీషియం మంచి మూలం. దీన్ని నెయ్యి, ఉప్పు, ఎండుమిరియాలతో తేలికగా వేయించి తినవచ్చు. మఖానా ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. నిద్రలేమికి ఇది ఉత్తమ ఔషధం.కొబ్బరి నీరు మెగ్నీషియం, పొటాషియం మంచి మూలం. ఇది కండరాలను సడలించడానికి సహాయపడుతుంది. భోజనం తర్వాత కొబ్బరి నీరు తాగడం వల్ల శరీరం విశ్రాంతి పొందుతుంది. హాయిగా నిద్రపడుతుంది. చిలగడదుంపలో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది రాత్రి భోజనానికి ముందు తినడం బెస్ట్ ఫుడ్ అవుతుంది. రాత్రి భోజనంలో చిలకడదుంప తినడం వల్ల రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది. పైగా ఇది బాగా నిద్రపోవడానికి కూడా సహాయపడుతుంది. గోరువెచ్చని పాలల్లో దాల్చిన చెక్క పొడిని కలుపుకుని తాగడం వల్ల కూడా నిద్రలేమి సమస్య దూరం అవుతుంది. బెడ్‌పై వాలగానే త్వరగా గాఢ నిద్రలోకి జారుకుంటారు. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల నిద్రలేమి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. త్వరగా సమస్య తగ్గి నిద్రలోకి జారుకుంటారు.

## ఇది మామూలు పండు కాదు..

ఆరోగ్యం కోసం మనం ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటాం. అలాంటి వాటిలో భాగంగా ప్రతి రోజూ ఉదయం అల్పాహారంలో ఒక గిన్నె దానిమ్మ గింజలు చేర్చుకోవడం ఎన్నో అద్భుత ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. సుమారు 170 గ్రాముల ఒక గిన్నె దానిమ్మ గింజల్లో 145 కేలరీలు, 33 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 24 గ్రాముల చక్కెరలు, 7 గ్రాముల డైటరీ ఫైబర్, 3 గ్రాముల ప్రోటీన్, 1 గ్రాము కొవ్వు ఉంటాయి. అంతేకాకుండా, ఇది విటమిన్ సి రోజువారీ అవసరంలో 30%, విటమిన్ కె లో 36%, ఫోలేట్ (బి9) లో 15% అందిస్తుంది. దానిమ్మ గింజలు (ఆరిల్స్) పోషకాలకు నిలయం. శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు మంటను తగ్గించడంలో, కణాలను దెబ్బతినకుండా కాపాడటంలో, వృద్ధాప్య ప్రక్రియను నెమ్మది చేయడంలో సహాయపడతాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రతిరోజూ ఒక గిన్నె దానిమ్మ తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడం, రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడం, రక్తపోటును తగ్గించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ఆక్సీకరణ ఒత్తిడి, హైపర్‌గ్లైసీమియా వంటి వివిధ వ్యాధుల ప్రమాద కారకాలను నివారించడంలో లేదా చికిత్స చేయడంలో దానిమ్మ సహాయపడుతుంది.

శక్తినిస్తుంది: దానిమ్మలో సహజసిద్ధమైన ఫ్రక్టోజ్, గ్లూకోజ్ ఉంటాయి, ఇవి ప్రాసెస్ చేసిన చక్కెరల వల్ల కలిగే “క్రాష్” లేకుండా తక్షణ శక్తిని అందిస్తాయి. అలాగే, హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచి, కణాలకు ఆక్సిజన్ ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది, అలసట లేదా రక్తహీనత ఉన్నవారికి ఇది చాలా సహాయపడుతుంది. చర్మ సౌందర్యం: విటమిన్ సి పుష్కలంగా ఉండటం వల్ల చర్మాన్ని కాంతివంతం చేసి, కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దానిలోని శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ముడతలు, సన్నని గీతలు, చర్మం వదులుగా మారడానికి కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌ను ఎదుర్కొంటాయి. అధిక నీటి శాతం చర్మాన్ని తేమగా, మృదువుగా, నిండుగా ఉంచుతుంది. యూవీ కిరణాల వల్ల కలిగే చర్మ నష్టాన్ని కూడా యాంటీఆక్సిడెంట్లు సరిచేసి, పిగ్మెంటేషన్ లేదా టానింగ్‌ను తగ్గిస్తాయి.

యాంటీ-ఇన్ఫ్లమేటరీ గుణాలు: పునికలాజిన్స్, ఆంథోసైనిన్స్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు కణాల స్థాయిలో మంటను తగ్గించడంలో సహాయపడతాయి. దానిమ్మను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె జబ్బులు, మధుమేహం, కీళ్లనొప్పులతో సంబంధం ఉన్న దీర్ఘకాలిక మంట తగ్గవచ్చు. గుండె ఆరోగ్యానికి మేలు:దానిమ్మలోని పాలిఫెనాల్స్, ఫ్లేవనాయిడ్లు చెడు కొలెస్ట్రాల్ ఆక్సీకరణను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది రక్తనాళాలను సరళంగా ఉంచి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, అడ్డుపడకుండా నిరోధిస్తుంది. నిపుణుల ప్రకారం, దానిమ్మను రోజూ తీసుకోవడం వల్ల సిస్టోలిక్ రక్తపోటు తగ్గుతుంది, ముఖ్యంగా హైపర్‌టెన్షన్ ఉన్నవారిలో రక్తనాళాల గోడలను విశ్రాంతి చేసి, గుండెపై ఒత్తిడిని తగ్గిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ:తీపిగా ఉన్నప్పటికీ, దానిమ్మ తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటుంది. పూర్తిగా తిన్నప్పుడు ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించే వారికి కూడా అనుకూలంగా ఉంటుంది. జీర్ణక్రియకు సహాయపడుతుంది: దానిమ్మ గింజల్లో కరిగే ఫైబర్ ఉంటుంది, ఇది క్రమం తప్పకుండా మలవిసర్జనకు సహాయపడుతుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది మంచి గట్ బ్యాక్టీరియాకు పోషణను అందిస్తుంది. దానిమ్మలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ సమ్మేళనాలు, ముఖ్యంగా పునికలాజిన్స్, ప్రేగులలోని మంటను తగ్గిస్తాయి. ఇది కాలేయం, పిత్తాశయం పనితీరుకు కూడా సహాయపడుతుంది.

క్యాన్సర్ నిరోధక గుణాలు: నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, దానిమ్మ పండు నుండి లభించే పాలిఫెనాల్స్ క్యాన్సర్‌ను నివారించే చికిత్స చేసే ప్రభావాలను కలిగి ఉన్నాయని అనేక జంతు నమూనాలలో అధ్యయనం చేయబడిరది. యాంటీఆక్సిడెంట్లు, పునికలాగిన్స్, ఎలాజిక్ యాసిడ్ వంటివి దానిమ్మలో పుష్కలంగా ఉంటాయి.



## పూల్‌మఖానాని ఇలా తింటే ఎన్ని లాభాలో ?

ఎండాకాలంలో శరీరాన్ని చల్లబరిచే ఆహారాలు తీసుకోవడం చాలా ముఖ్యం. అలాంటి వాటిలో మఖానా కూడా అతి ముఖ్యమైనది. మఖానా తీసుకోవడం వల్ల వేసవి తాపం నుంచి శరీర ఉష్ణోగ్రతని తగ్గించి చల్లదనం అందుతుంది. అంతేకాదు.. మఖానా పుష్కలమైన పోషకాలు నిండి ఉంది. ఇందులో మెగ్నీషియం, పొటాషియం, ఫైబర్‌లు సమృద్ధిగా ఉన్నాయి. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. మఖానీ పూర్తి లాభాలను పొందాలంటే తినే విధానం తప్పనిసరిగా తెలుసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. పూల్ మఖానా.. ఇది కూడా డ్రై ఫ్రూట్‌స్‌లాంటిదే. వీటిలో ఎన్నో గొప్ప ఔషధ గుణాలు ఉన్నాయి. అందుకే, వీటిని పలు రకాల మందుల తయారీలో కూడా వాడతారని నిపుణులు చెబుతున్నారు.. వీటితో కలిగే లాభాలను పూర్తిగా పొందాలంటే మఖానాని పాలలో నానబెట్టి తినడం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మఖానాను పాలలో నానబెట్టి తింటే పాలలోని ప్రోటీన్, కాల్షియం, మఖానాలోని ఫైబర్‌తో కలిసి సూపర్‌ఫుడ్‌గా మారుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. దీనిని తీసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగ్గా మారుతుంది. శరీరానికి అన్నీ పోషకాలు అందుతాయి. దీని వల్ల బాడీ ఎనర్జీగా కూడా ఉంటుంది. పాలలో నానబెట్టిన మఖానా తినటం వల్ల ఆరోగ్యంతో పాటు చర్మానికి కూడా లాభాలు ఉన్నాయి. మఖానా బ్లడ్ షుగర్ లెవల్స్‌ని సరి చేస్తుంది. దీని వల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. అంతేకాదు, ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ బాడీలోని ఆక్సిడేటీవ్ స్ట్రెస్‌ని తగ్గించి ఒత్తిడిని దూరం చేస్తాయి. దీని వల్ల గుండెపై అదనపు భారం కూడా తగ్గుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. పాలు, మఖానాని కలిపి తీసుకుంటే శరీరానికి కావాల్సిన ప్రోటీన్ సులభంగా అందుతుంది. దీంతో కండరాలు దృఢంగా మారుతాయి. మఖానాలోని కార్బోహైడ్రేట్స్, పాలలోని సహజ చక్కెరలు శక్తిని రెట్టింపు చేయడంలో సహాయపడతాయి. పాలు, మఖానా కలిపి తీసుకుంటే ఎనర్జీ లెవెల్స్ ఒక్కసారిగా పెరుగుతాయి. బరువు తగ్గాలనుకునేవారు ఆహారంలో మఖానా పాలను చేర్చుకోవాలి. ఇది తక్కువ కేలరీల కంటెంట్‌ను కలిగి ఉంటుంది. మఖానా పాలు శక్తి బూస్టర్‌గా పని చేస్తుంది. మీరు రోజంతా పని ఒత్తిడితో అలసిపోతే పూల్‌మఖానా, పాలతో తీసుకోవటం వల్ల మీకు తక్షణ శక్తి లభిస్తుంది. మఖానాను పాలలో కలిపి తీసుకోవడం వల్ల వాపు, మలబద్ధకం, కడుపు నొప్పి మొదలైన సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది.



## ఇదొక ఎమోషనల్ జర్నీ: నిధి అగర్వాల్

యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్ త్వరలో 'హరిహర వీరమల్లు' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా.. క్రిష్, జ్యోతికృష్ణలు సంయుక్తంగా తెరకెక్కించిన ఈ చిత్రానికి ఏఎమ్ రత్నం నిర్మిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఎమ్ ఎమ్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ మూవీ జూన్ 12 థియేటర్స్‌లోకి రానుంది. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు చిత్ర బృందం. ఈ సందర్భంగా తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించగా.. ఈ సినిమాపై హీరోయిన్ నిధి అగర్వాల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది.

"హరిహర వీరమల్లు' చిత్రం నాకు ఒక ఎమోషనల్ జర్నీలాగా అనిపిస్తుంది. ఎందుకంటే మేము ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ చేసి దాదాపు 5 సంవత్సరాలు అవుతుంది. ఈ ప్రాజెక్ట్ బిగినింగ్ నుంచి ఇప్పుడు ఎండింగ్ వరకు ఎంతో మందితో షూట్ చేశాము. అందుకే ఈ మూవీ ఎమోషనల్ జర్నీ, ఎమోషనల్ ఫీలింగ్. అండ్ మీ అందరికి ఓ ఇంపార్టెంట్ విషయం చెప్పాలి. నేను పవన్ కల్యాణ్‌కు బిగ్గెస్ట్ ఫ్యాన్‌ను. నిజంగా ఆయనతో నటించే అదృష్టం నాకు దొరడం చాలా సంతోషంగా ఉంది. థాంక్యూ రత్నం సర్.. మీలాంటి హార్డ్ వర్కింగ్ వ్యక్తిని నేను ఎక్కడా చూడలేదు. జ్యోతి సర్ కూడా ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం ఎంతో హార్డ్ వర్క్ చేశారు. ఈ మోస్ట్ స్పెషల్ ఫిలిమ్ ఎప్పటికి నా హృదయానికి దగ్గరగా ఉంటుంది' అంటూ చెప్పుకొచ్చింది.



## కొడుకుతో సినిమాలు తీయను

మాములుగా స్టార్ కుటుంబ సభ్యులు ఎవరైనా నిర్మాతలుగా మారితే వాళ్ళ స్వంత హీరోలతోనే సినిమాలు తీయడం పరిపాటి. ఇది అన్ని భాషల్లోనూ ఉన్నదే. మెగా, నందమూరితో మొదలుపెట్టి బాలీవుడ్ రాజ్ కపూర్ ఫ్యామిలీ దాకా ఇది చాలా మాములు విషయం. లాభమో నష్టమో అంతా మాకే ఉంటుందనే సిద్ధాంతంతో దీన్ని ఫాలో అవుతారు. కానీ యష్ తల్లి పుష్ప అరుణ్ కుమార్ ఆలోచన వేరేలా ఉంది. ఆవిడ స్వంతంగా పిఏ ప్రొడక్షన్స్ పేరుతో ఒక బ్యానర్ స్థాపించి కొతలవాడి పేరుతో ఒక మూవీ తీస్తున్నారు. దీనికి సంబంధించిన కబుర్లు పంచుకోవడానికి తెలుగు మీడియాతో బెంగళూరులో ప్రత్యేకంగా మాట్లాడారు. అందులో భాగంగా మా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ యష్‌తో మాత్రం సినిమా తీయనని చెప్పేశారు. కడుపు నిండిన వాడికి అన్నం, బోడి తలతో ఉన్నవాడికి కొబ్బరినూనె ఇవ్వకూడదని పెద్దలు చెబుతారని, నేను దాన్నే పాటిస్తానని, యష్ కు ఆఫర్లు ఇచ్చే ప్రొడ్యూసర్లు, డబ్బిచ్చే నిర్మాతలు వేరే ఉన్నారని, తాను మాత్రం కొత్తవాళ్లకు ప్రతిభ ఉన్న ఉన్నవాళ్లకు ఛాన్స్ ఇస్తానని కుండబద్దలు కొట్టేశారు. సో తల్లితండ్రుల పేరు మీదున్న సంస్థలో యష్ నటించే అవకాశం లేదన్న మాట. ఖచ్చితంగా ఇదే మాట మీద ఉంటారా అంటే ప్రస్తుతానికి ఇంత క్లారిటీతో చెప్పారు కాబట్టి బహుశా ఛాన్స్ లేకపోవచ్చు. కొతలవాడిలో పృథ్వి అంబార్ హీరోగా నటిస్తున్నాడు. దాదాపు అందరూ అప్ కమింగ్ వాళ్లే నటిస్తున్నారు, పని చేస్తున్నారు.



## విజయ్ మూవీకి బజ్ లేదేంటి

తెలుగులో ఉప్పెన, విడుదలతో మనకూ దగ్గరైన విజయ్ సేతుపతి కొత్త సినిమా ఏస్ ఎల్లుండి విడుదల కానుంది. కానీ కనీస స్థాయిలో బజ్ లేకపోవడం బయ్యర్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఎందుకంటే మహారాజా లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత వస్తున్న మూవీ అంటే ఎంత లేదన్నా ఓ మాదిరి అంచనాలుంటాయి. కానీ దానికి భిన్నంగా ఏస్ చాలా సైలెంట్ గా వస్తోంది. సప్తసాగరాలు దాటి సైడ్ ఏబి హీరోయిన్, జూనియర్ ఎన్టీఆర్ సరసన డ్రాగన్ చేస్తున్న రుక్మిణి వసంత్ హీరోయిన్ కావడం ఎలాంటి ప్లస్ కాలేకపోతోంది. ఆర్ముగ కుమార్ దర్శకత్వంలో ఆయనే స్వంతంగా భారీ బడ్జెట్ తో నిర్మించారు. ట్రైలర్ కంటెంట్ చూస్తే ఆసక్తికరంగానే అనిపించింది. బోల్ట్ కాశి అనే వ్యక్తి జీవితంలో చాలా పెద్ద గతం ఉంటుంది. అదేంటో తెలుసుకోవడానికి చుట్టుపక్కల వాళ్ళు ఎంత ప్రయత్నించినా సాధ్యపడదు. అయితే కాశి ఒక పెద్ద ప్లాన్ తో ఉంటాడు. దేశవిదేశాలు తిరిగి దాన్ని నెరవేర్చుకునే క్రమంలో జూదం ఆడే మాఫియా ప్రపంచంలో అడుగు పెడతాడు. ఈ పాయింట్ మీద ఏస్ నడుస్తుంది. బ్యాక్ డ్రాప్ సీరియస్ గా అనిపిస్తున్నా యోగిబాబుతో కావాల్సిన ఫన్ చేయించడంతో పాటు యాక్షన్, కమర్షియల్ ఎలిమెంట్స్ బాగానే జొప్పించినట్టు అనిపిస్తోంది. డియర్ కామ్రేడ్ ఫేమ్ జస్టిన్ ప్రభాకరన్ సంగీతం సమకూర్చారు. ఏస్ కు బాక్సాఫీస్ దగ్గర పోటీలేని వాతావరణం కలిసి వచ్చేలా ఉంది. కాకపోతే హైప్ ఇంత తక్కువగా ఉండటం వల్ల ఓపెనింగ్స్ తేవడం అనుమానంగానే ఉంది. మహారాజా లాగా యునానిమాస్ టాక్ వస్తే మెల్లగా పికప్ కావొచ్చు.



## మన దేశానికి వచ్చేస్తున్న యూనివర్సల్ స్టూడియోస్,

హాలీవుడ్ సినిమాలతో బాగా అనుబంధం ఉన్నవారికి యూనివర్సల్ స్టూడియోస్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రపంచవ్యాప్తంగా సంచలనాలు సృష్టించిన ఎన్నో హాలీవుడ్ సినిమాలు రూపుదిద్దుకున్నది యూనివర్సల్ స్టూడియోలోనే. ప్రపంచ సినీరంగానికి యూనివర్సల్ స్టూడియో అనేది ఒక డ్రీమ్ మేకింగ్ ప్లేస్ అని చెప్పొచ్చు. అంతర్జాతీయంగా పేరు తెచ్చుకోవాలనుకున్న ప్రతీ టెక్నీషియన్ కల యూనివర్సల్ స్టూడియో. ఈ నేపథ్యంలో భారతీయ సినిమా రంగానికి సినీ అభిమానులకు చెప్పుకోదగ్గ శుభవార్త ఏమిటంటే, మన దగ్గర త్వరలో యూనివర్సల్ స్టూడియోస్ థీమ్ పార్క్ ఏర్పాటు కానుంది.

అవును...నిజం...భారతదేశం త్వరలో యూనివర్సల్ స్టూడియోస్ థీమ్ పార్క్‌ను స్వాగతించబోతోంది. ఈ ప్రపంచ వినోద దిగ్గజం త్వరలో ప్రపంచ స్థాయి థీమ్‌పార్క్‌తో సహా భారతదేశంలోకి అడుగుపెట్టనుంది. త్వరలోనే సినీ రూపకర్తల కల సాకారం కానుంది. భారతదేశం ఇప్పుడు ప్రపంచంలో యూనివర్సల్ స్టూడియోస్ పార్క్ ఉన్న కొన్ని దేశాలలో ఒకటిగా అవతరించనుంది. ప్రస్తుతం ఈ థీమ్ పార్క్ యునైటెడ్ స్టేట్స్, జపాన్, సింగపూర్, చైనా దేశాల్లో మాత్రమే ఉంది.

అందుతున్న సమాచారం ప్రకారం, భారతదేశంలో యూనివర్సల్ స్టూడియోస్ థీమ్ పార్క్ త్వరలో హర్యానాలోని ద్వారక ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలో ఢిల్లీ నుంచి కొంచెం దూరంలో నెలకొల్పనున్నారు. ఇటీవల హర్యానా ముఖ్యమంత్రి ప్రకటించిన ప్రకారం, ఈ పార్క్ గురుగ్రామ్ రూపురేఖల్ని మార్చేయనున్న ప్రాజెక్ట్ కానుంది. హర్యానా రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (హెచ్ఎస్ ఐఐడిసి) ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తుంది. వాస్తవానికి, ఇప్పటికే సైట్ చుట్టూ మౌలిక సదుపాయాల ప్రణాళికల అమలు కూడా ప్రారంభించింది. ఇది రాబోయే 3 మిలియన్ చదరపు అడుగుల మాల్ లోపల అభివృద్ధి చేయబడిన ఇండోర్ థీమ్ పార్క్ అవుతుంది. మీడియా నివేదికల ప్రకారం, వినోద ఉద్యానవనాన్ని నిర్మించడానికి భారతి ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థ ఇక్కడ 300,000 చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకుంటుందని తెలుస్తోంది. భారతదేశంలో ప్రారంభమవుతున్న ఈ అత్యంత భారీ పార్క్‌లో ఒసాకా హాలీవుడ్‌లో ఉన్నట్లుగా థీమ్ , రైడ్‌లు, షోలు కుటుంబ సమేతంగా సందర్శించదగ్గ ఆకర్షణలు ఉంటాయి. మన దేశానికి యూనివర్సల్ స్టూడియోస్ రాక ఉపాధి రంగానికి కూడా ఊతమిచ్చే శుభవార్త అనే చెప్పాలి. ఈ పార్క్ అనేక రకాల ఉపాధి అవకాశాలను సృష్టించనుంది. దీని చుట్టుపక్కల ప్రాంతంలో హోటళ్ళు, రవాణా సేవలు షాపింగ్ కేంద్రాలు తదితర వాణిజ్య కార్యకలాపాలు ముమ్మరం అవుతాయి. భవిష్యత్తులో ఈ ప్రాంతం సరికొత్త సినిమా క్యాపిటల్‌గా అవతరించినా ఆశ్చర్యం లేదు. గురుగ్రామ్‌లోని ఈ స్థలం అటు ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, ఢిల్లీ మెట్రో మార్గాలు ఇటు మరి కొన్ని ప్రధాన రహదారులకు సులభమైన కనెక్టివిటీని అందిస్తుంది. నిజానికి యూనివర్సల్ స్టూడియోస్ భారతదేశంలో తన తొలి అడుగు వేసేందుకు ఈ ప్రదేశాన్ని ఎంచుకోవడానికి ఇదీ ఒక కారణమే.






## రెండు మూడు పెళ్లిళ్లు చేసుకుంటా: బెల్లంకొండ

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా నటించిన చిత్రం 'భైరవం'. జయంతిలాల్ గడా సమర్పణలో విజయ్ కనకమేడల దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. సినిమా విడుదల సందర్భంగా ప్రమోషన్స్ కార్యక్రమాలలో మేకర్స్ బిజీగా ఉన్నారు. తాజాగా దర్శకుడితో పాటు ముగ్గురు హీరోలు యాంకర్ సుమతో ఒక ఇంటర్వ్యూ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే పెళ్లి గురించి అభిప్రాయం చెప్పాలని బెల్లంకొండ శ్రీనివాస్‌ను సుమ అడిగింది. అందుకు వారు చెప్పిన సమాధానం నెట్టింట వైరల్ అవుతుంది. బెల్లంకొండ శ్రీనివాస్ పెళ్లిని ఉద్దేశిస్తూ.. దర్శకుడు విజయ్ కనకమేడల ఇలా అంటాడు 'పెళ్లి గురించి చెప్పడానికి ఏమీ లేదు.. అంతా డాడీనే' అంటూ నవ్వేస్తాడు. ఆపై పక్కనే ఉన్న మనోజ్ కలుగజేసుకుని ఇలా అంటాడు.. 'నిద్రలేచాక నువ్వు అన్ని విషయాలు మరిచిపోతున్నావ్ కదా తమ్ముడు రోజుకొక పెళ్లి అంటే కష్టం' అని అంటాడు. బహుశా 'భైరవం' సినిమాలో శ్రీనివాస్ పాత్ర మతిమరుపుతో సంబంధం ఉండొచ్చు. అయితే, చివరగా తన పెళ్లి గురించి బెల్లంకొండ శ్రీనివాస్ ఇలా అంటాడు. 'కొంతమంది హీరోలను ఆదర్శంగా తీసుకుని రెండుమూడు పెళ్లిళ్లు చేసుకోవాలని అనుకుంటున్నాను.' అని అంటాడు. సరదాగా సాగిన ఈ సంభాషణ నెట్టింట వైరల్ అవుతుంది. బెల్లంకొండ శ్రీనివాస్ వ్యాఖ్యలపై నెట్టింట విమర్శలు వస్తున్నాయి. ఇంతకు ఏ హీరోలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని కామెంట్లు చేస్తున్నారు. ఇండస్ట్రీలో కొందరు రెండో పెళ్లి చేసుకున్నారని నువ్వు కూడా అలా చేసుకుంటానని ఎలా కామెంట్ చేస్తావ్ అంటూ ప్రశ్నిస్తున్నారు. మనోజ్‌కు కౌంటర్‌గానే శ్రీనివాస్ ఈ వ్యాఖ్యలు చేశారని మరికొందరు చెబుతున్నారు. బెల్లంకొండ వ్యాఖ్యలు ఎవరిపై ఉండొచ్చు అనేది తెలిస్తే మీరూ కామెంట్ చేయండి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ఆర్ఎంపీల చట్టబద్ధత అంశాన్ని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకువెళతా..

**తుంబూరి దయాకర్ రెడ్డి..**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

గ్రామీణ క్షేత్రాలలో వైద్యం చేసే ఆర్ఎంపిలకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించే అంశాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుంబూరి దయాకర్ రెడ్డి అన్నారు. గురువారం టిటిడిసి భవనంలో తెలంగాణ మైనారిటి గ్రామీణ వైద్యుల సంఘం 11వ మహాసభ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ . హసన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గ్రామీణ వైద్యుల గుర్తింపుకు , చట్టబద్ధతకు కృషి చేశారని కొనియాడారు. ఆయన హయంలో ఆర్ఎంపీలకు వృత్తిపర శిక్షణ కల్పించడంతో పాటు వారికి సర్టిఫికెట్ల ను కూడా జారీ చేశారని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రక్రియ ఆగిపోయిన కారణంగా ఆర్ఎంపీలకు తీవ్రమైన నష్టాన్ని , సమస్యలను కలగజేసింది అని పేర్కొన్నారు.

శిక్షణ ఆధారంగా లేకుంటే అనుభవపరంగా ఆర్ఎంపీలకు ఏ విధంగా చట్టబద్ధత కల్పిస్తారో ? తెలియదు గానీ ఆర్ఎంపీలకు మాత్రం తప్పనిసరిగా వృత్తిపర రక్షణకు చట్టబద్ధత అవసరమన్నారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటిని చట్టబద్ధత తో ఎదుర్కోవచ్చని తెలిపారు. ఇంజక్షన్లు , మాత్రలు ఎవరో తయారు చేస్తే వాటిని ఆర్ఎంపీలు ఇస్తే , ఒకవేళ జరిగే ప్రమాదంలో ఆర్ఎంపీలకు బాధ్యులు చేయడం సమంజసం కాదన్నారు. ఆర్ఎంపీలు సమిష్టిగా తమ సమస్యల పై ఉద్యమాలు చేయాలని , అందుకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆర్ఎంపీలు చాలా కాలం నుండి కోరుతున్న సంఘం కార్యాలయం ఏర్పాటు పనిని త్వరలో పూర్తయ్యేటట్టు సహకారం చేస్తామన్నారు. ఆర్ఎంపి లకు వీటితోపాటు ఇంకా చాలా సమస్యలు ఉన్నాయని వాటిని కూడా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రముఖ సామాజిక వేత్త స్పర్శ భాస్కర్ , రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీలు ప్రసంగిస్తూ గ్రామీణ ప్రాంతాలలో వైద్యం చేసే ఆర్ఎంపీల సమస్యల సాధనకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు.

తొలుత పహల్గాం ఘటనలో మృతి చెందిన అమాయక పర్యాటకులకు , మురళి నాయక్ కు సంతాపం ప్రకటిస్తూ , రెండు నిమిషాల పాటు మౌనం పాటించి , శ్రద్ధాంజలి ఘటించారు. ఈ మహాసభలో జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్. హసన్ (నేరడ) , వ్యవస్థాపక అధ్యక్షులు షేక్. నజిరుద్దీన్ , జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. జానీ మియా , జిల్లా కోశాధికారి షేక్ బాబు సాహెబ్ లు ప్రసంగాలు చేయగా నాయకులు షేక్. ఖాసిం, షేక్. చాంద్ పాషా ,షేక్. ఆ షా, షేక్ .మొహమ్మద్ సాహెబ్, షేక్. అమీర్ , షేక్ జానీ (శ్రీరామ్ గిరి ) , షేక్. జానీ మియా (మధిర), షేక్. రంజాన్ పాషా( పాలేరు ) , షేక్. మౌలానా (భద్రాచలం ) , షేక్. అఖిల్ అహ్మద్ (ఇల్లందు) , షేక్. పాషా ( ఇల్లందు ), షేక్. అజిముద్దీన్ (పాల్వంచ ) , షేక్. మన్సూర్ అలీ , షేక్ నబి , షేక్, రబ్బాని , షేక్. అలీ , ఎండి. మహిముద్ (గుండాల ), షేక్. అహ్మద్ పాషా ,షేక్.వలి (సత్తుపల్లి ), షేక్. నభి, షేక్ .బాజీ , షేక్. ఇమామ్, షేక్ .బషీర్, అఖిల్, సలాం, సిరాజుద్దీన్ , ఎండి. యాకుబ అలీ ,మౌలానా ఖాన్ , షేక్ .గౌస్ , పాషా , షేక్ .సుభాని, షేక్. గౌస్, షేక్. నాగుల్ మీరా, షేక్. సైదా ,నాగుల్ మీరా ,సుల్తాన్ బాబా ,సర్దార్ బహదూర్ ఖాన్, బాజీ, ముజిబుల్ రెహమాన్ ,వలి ,రెహమాన్, జానీ ,మహమ్మద్ జానీ, షేక్ .అబ్దుల్ కరీం, షేక్. హబీబ్, షేక్. సోందుమియా, షేక్. అహ్మద్, ఖాజా మియా, మోహినియా జానీ మియా ఎండి ఖాసీం ఎండి .హమీద్ అలీ, ఎండి. రహీం, ఖదీర్, శంషుద్దీన్ , షేక్. అలీ , హుస్సేన్ పాషా, ఎండి. ఖాజా, ఎండి .మౌలానా ,అన్వర్ పాషా ,చాంద్ పాషా, నయీమ్ ,ఉమర్, ఎండి. అబ్దుల్ ఖాదర్, జిలాని, ఎండి. అఫ్జల్ , ఉస్మాన్ పాషా ,మస్తాన్ పాషా ,రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలి

- **విలేకరుల సమావేశంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్**

**ఖమ్మం బ్యూరో , తెలంగాణ ముచ్చట్లు:**

దండకారణ్యం నారాయణపూర్, బస్తర్ లో జరిగిన బూటకపు ఎన్కౌంటర్లో అమరులైన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు @బసవరాజ్ తో పాటు మరో 26 మంది ఎన్కౌంటర్ పైన సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే న్యాయ విచారణ జరిపించాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు, మేధావులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మంచికంటి భవన్లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు, మేధావులు విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ప్రత్యామ్నాయ పౌర సమూహం(సిసిఏ)నాయకులు కాకి భాస్కర్, రవి మారుత్, డాక్టర్ ఎం.ఎఫ్ గోపీనాథ్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, తెలంగాణ పీపుల్స్ జేఏసీ జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి విజయ్, జర్నలిస్టు యూనియన్ జిల్లా కార్యదర్శి చిర్ర రవి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు విప్లవ కుమార్, తుడుం దెబ్బ నాయకులు రమనాల లక్ష్మయ్య, ప్రజా ఫ్రంట్ నాయకులు సంజీవరావులు మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా మావోయిస్టు పార్టీ మేము కాల్పుల విరమణ ప్రకటించాం, శాంతి చర్చలకు రావడానికి సిద్ధంగా ఉన్నామని, కాల్పుల విరమణలో ఉన్న మావోయిస్టుల మీద యుద్ధం చేయడానికి ఎలా వస్తారని, కచ్చితంగా ఇది ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా చేసిన హత్యలని పేర్కొన్నారు. మధ్య భారతదేశంలో ఉన్న ఖనిజ సంపదంతా బడా కార్పొరేట్ కంపెనీలకు కట్ట పెట్టడానికి రాజ్యాంగ విరుద్ధంగా ఆదివాసులపై దాడులు చేస్తూ చంపేస్తున్నారని విమర్శించారు. భారత్ పాకిస్తాన్ బోర్డర్ లో ఉండాల్సినటువంటి డ్రోన్లు, పారా మిలిటరీ బలగాలు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి నరమేదాన్ని సృష్టిస్తున్నారన్నారు. ఈ దేశ ప్రధానమంత్రి మోడీ, హోం మంత్రి అమిత్ షా ఎన్కౌంటర్ పై స్పందించి మేము విజయం సాధించాం అని గొప్పగా చెప్పుకోవడం దిగజారుడుతనమన్నారు. ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టులని, మావోయిస్టులని ఎన్కౌంటర్ పేరుతో చంపి వీరత్వం అనుకోవడం చేతకానితనమన్నారు. ఆదివాసులపై నరమేధాన్ని సృష్టించి కర్రెగుట్టలపైన జాతీయజెండాతో సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి దేశ పౌరులను కాల్చి చంపితే పట్టుకోవడం చేతకాదు కానీ అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కేశవరావును నిర్దాక్షిణ్యంగా పట్టుకొచ్చి చిత్రహింసలు పెట్టి ఎన్కౌంటర్ పేరుతో హత్య చేసే హక్కు ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యతిరేక పరిపాలన చేస్తున్న ఈ మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, సిపిఐ జిల్లా నాయకులు సింగ్ నరసింహారావు, మాస్ లైన్ జిల్లా నాయకులు సి.వై పుల్లయ్య, ఝాన్సీ, న్యూడెమోక్రసీ నాయకులు మోహన్ రావు, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు స్వర్ణ సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి మస్తాన్, జార్జి రెడ్డి పిడిఎస్యు జిల్లా కార్యదర్శి సురేష్, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా నాయకులు నరేందర్, అశోక్ పాల్గొన్నారు.







# ఐపీఎల్ హిస్టరీలో మాన్‌స్టర్ రికార్డు..

వైభవ్ సూర్యవంశీ ఈ ఆటగాడు వయసులో చిన్నవాడే, కానీ తన ఆటతో దిగ్గజాలను కూడా విస్మయానికి గురి చేస్తున్నాడు. దానికి రుజువుగా సిక్సర్ల వర్షం కురిపించి ఐపీఎల్ రికార్డును సమం చేసిన ఆ 122 బంతులే అనడంలో ఎలాంటి సందేహం లేదు. వైభవ్ సూర్యవంశీ ఏ 122 బంతులు ఆడాడు, ఏ రికార్డు సృష్టించాడు అని మీరు ఆలోచిస్తున్నారా? అక్కడికే వస్తున్నాం. ఈ ఘనతను ఐపీఎల్‌లో చేసిన సంగతి తెలిసిందే. ఐపీఎల్ 2025 (ఐూ 2025) లో రాజస్థాన్ రాయల్స్ ప్రయాణం ముగిసింది. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ 122 బంతులను ఎదుర్కొని 252 పరుగులు చేశాడు. ఈ పరుగుల సమయంలో వైభవ్ సూర్యవంశీ 206.55 స్ట్రైక్ రేట్‌తో కొట్టిన సిక్సర్ల సంఖ్య అతని పేరును రికార్డు పుస్తకాలలో నమోదు చేసింది. 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2025లో 122 బంతుల్లో 24 సిక్సర్లు కొట్టాడు. 20 ఏళ్లకు ముందు ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డును సమం చేశాడు. రిషబ్ పంత్ కూడా 20 ఏళ్లకు ముందు అదే సంఖ్యలో సిక్సర్లు కొట్టాడు. అయితే, ఐపీఎల్ 2025లో వైభవ్ సూర్యవంశీ కేవలం 122 బంతుల్లో సాధించిన దానికంటే, ఐపీఎల్ 2017లో పంత్ 99 బంతులు ఎక్కువగా ఆడాడు. అతను 221 బంతులు ఎదుర్కొన్నాడు. వైభవ్ సూర్యవంశీకి కేవలం 14 ఏళ్లు. అంటే అతనికి 20 ఏళ్లు నిండడానికి ఇంకా 6 సంవత్సరాలు ఉన్నాయి. అంటే, అంతకు ముందు అతను ఐపీఎల్ ఆడటానికి 5 సీజన్లు ఉంటాయి. ఇప్పుడు, అతను ఐపీఎల్ 2025లో కేవలం 7 మ్యాచ్‌లు ఆడి 24 సిక్సర్లు కొడితే, తదుపరి ఐపీఎల్ సీజన్లలో అతను పూర్తి మ్యాచ్‌లు ఆడతానుకుంటే, ఎన్ని సిక్సర్లు బాదుతాడో ఊహించలేం. ఈ విధంగా, అతను ఆడే 5 సీజన్లలో ఒకదానిలో, 20 ఏళ్లు నిండకముందే, అతను ఖచ్చితంగా పరుగుల వర్షం కురిపిస్తాడనే సందేహం లేదు. దీంతో అద్భుతమైన రికార్డు సృష్టించే ఛాన్స్ ఉంది. ఇది బహుశా ఐపీఎల్‌లో ఎప్పటికీ బద్దలు కొట్టబడని రికార్డు అవుతుంది.

# గుజరాత్‌పై లక్నో విజయం

**ఐపీఎల్-2025లో లక్నోసూపర్ జెయింట్స్ ఎట్టకేలకు మరో విజయాన్ని నమోదు చేసింది. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా గురువారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 33 పరుగుల తేడాతో లక్నో విజయం సాధించింది. 236 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 202 పరుగులకు పరిమితమైంది. టైటాన్స్ బ్యాటర్లలో షారుఖ్ ఖాన్(57) టాప్ స్కోరర్‌గా నిలవగా.. షెర్ఫన్ రూథర్‌ఫర్డ్(38),బట్లర్(33), శుబ్‌మన్ గిల్(35) తమవంతు ప్రయత్నం చేశారు. లక్నో బౌలర్లలో విలియం ఓ రూర్క్ మూడు వికెట్లు పడగొట్టగా.. బదోని రెండు, ఆకాష్ మహారాజ్ సింగ్,అవేష్ ఖాన్ తలా వికెట్ సాధించారు.**

**మార్ష్ సూపర్ సెంచరీ..**

**ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోర్ సాధించింది. లక్నో బ్యాటర్లలో మిచెల్ మార్ష్ సూపర్ సెంచరీతో చెలరేగాడు. 64 బంతులు ఎదుర్కొన్న మార్ష్.. 10 ఫోర్లు, 8 సిక్స్‌లతో 117 పరుగులు చేశాడు. అతడితో పాటు నికోలస్ పూరన్(56), మార్‌క్రమ్(36) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. గుజరాత్ బౌలర్లలో అర్షద్ ఖాన్, సాయి కిషోర్ తలా వికెట్ సాధించారు.**







# ఆ ఇద్దరు రాజస్థాన్‌కు దండగే..?

ఐపీఎల్ 2025 సీజన్‌లో ఎన్నో అంచనాలతో అడుగుపెట్టిన రాజస్థాన్ రాయల్స్.. ఇటు అభిమానులను, అటు ఫ్రాంచైజీకి తీవ్ర నిరాశను మిగిల్చింది. ముఖ్యంగా కీలక ఆటగాళ్ల పేలవ ప్రదర్శన కారణంగా పాయింట్ల పట్టికలో 9వ స్థానంతో సర్దిపెట్టుకుంది. ఐపీఎల్ 2025 సీజన్ రాజస్థాన్ రాయల్స్ జట్టుకు, అభిమానులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన జట్టు, కీలక ఆటగాళ్ల పేలవ ప్రదర్శన కారణంగా పాయింట్ల పట్టికలో 9వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా, జట్టు యాజమాన్యం ఎంతో నమ్మకం



ఉంచి, రూ. 22.5 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించి రిటైన్ చేసుకున్న కెప్టెన్ సంజూ శాంసన్, విధ్వంసకర బ్యాటర్ షిమ్రాన్ హెట్‌మెయర్‌లు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయారు. ఈ ఇద్దరు కలిసి సీజన్ మొత్తంలో కేవలం 641 పరుగులు మాత్రమే చేయడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇంత భారీ మొత్తం వెచ్చించి వారిని అట్టిపెట్టుకోవడం సరైన నిర్ణయమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు, రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం సంజూ శాంసన్‌ను రూ. 14 కోట్లకు, షిమ్రాన్ హెట్‌మెయర్‌ను రూ. 8.5 కోట్లకు రిటైన్ చేసుకుంది. గత సీజన్లలో వీరి ప్రదర్శన, జట్టులో వారికున్న ప్రాముఖ్యత దృష్ట్యా ఈ నిర్ణయం సరైనదేనని అప్పట్లో చాలామంది భావించారు. సంజూ కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపించడంతో పాటు, కీలక సమయాల్లో బ్యాటింగ్‌లోనూ రాణించగలడని భావించారు. అలాగే, హెట్‌మెయర్ తనదైన రోజున ఎలాంటి బౌలింగ్‌నైనా చిత్తు చేయగల ఫినిషర్ అని నిరూపించుకుంటాడని భావించారు. సంజూ శాంసన్: 14 మ్యాచ్‌లలో కేవలం 402 పరుగులు మాత్రమే చేయగలిగాడు. కెప్టెన్‌గా జట్టును సమర్థవంతంగా నడిపించడంలోనూ విఫలమయ్యాడు. అతని బ్యాటింగ్ సగటు, స్ట్రైక్ రేట్ కూడా గతంతో పోలిస్తే తగ్గాయి. ప్రతి పరుగుకు రాయల్స్ యాజమాన్యం సుమారు రూ. 3.48 లక్షలు ఖర్చు చేసినట్లయింది.

# విండీస్‌ను చిత్తు చేసిన ఇంగ్లండ్

వెస్టిండీస్‌తో మూడు టీ20ల సిరీస్‌ను ఇంగ్లండ్ మహిళల జట్టు విజయంతో ఆరంభించింది. కాంటర్బరీ వేదికగా జరిగిన తొలి టీ20లో విండీస్‌ను 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ అమ్మాయిల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది.

విండీస్ బ్యాటర్లలో కెప్టెన్ హీలీ మాథ్యూస్ అద్భుతమైన సెంచరీతో చెలరేగారు. మిగితా బ్యాటర్లు విఫలమైనప్పటికి మాథ్యూస్ మాత్రం ఇంగ్లీష్ బౌలర్లను ఊతికారేసారు. మాథ్యూస్ 67 బంతుల్లో 16 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 100 పరుగులు చేసి ఆజేయంగా నిలిచింది. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ బెల్ రెండు వికెట్లు పడగొట్టగా.. ఆర్లోట్, స్మిత్, వాంగ్ తలా వికెట్ సాధించారు.

అనంతరం 147 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి చేధించింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో ఓపెనర్ సోఫియా డంక్లి(56 బంతుల్లో 12 ఫోర్లతో 81) టాప్ స్కోరర్‌గా నిలవగా.. హీథర్ నైట్ (27 బంతుల్లో 6 ఫోర్లతో



43 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. విండీస్ బౌలర్లలో జేమ్స్, ఫ్లేచర్ తలా వికెట్ పడగొట్టారు. మిగితా బౌలర్లందరూ చేతులెత్తేశారు. ఇక ఇరు జట్ల మధ్య రెండో టీ20 మే 23న కౌంటీ గ్రౌండ్, హోవ్ వేదికగా జరగనుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in